వేకువ సమయం

సంపుటి: 14 సంచిక: 229

VEKUVA SAMAYAM TELUGU DAILY

* Mahabubnagar * Hyderabad * Miryalaguda & Rangareddy   సంపాదకులు : కె.భాస్కర్‌రావు   రూ.2.00/- పేజీలు 8   తేది: బుధవారం 23 సెప్టెంబర్ 2026








**సమయం ప్రతినిధి:** ఢిల్లీ సర్ ప్రక్రియలో భాగంగా లాజికల్ డిస్క్రిపెన్సీస్ కేటగిరీ కింద ఓటర్లకు జారీ చేస్తున్న నోటీసులపై సుప్రీం కోర్టు ఈసీపై పలు ప్రశ్నలు సంధించింది. ఏ ప్రాతిపదికన ఈ నోటీసులు జారీ చేస్తున్నారని ఈసీని ప్రశ్నించింది. ఈ కేటగిరీపై స్పష్టత ఇవ్వాలని చెప్పింది. సర్ నోటీసులపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ దాఖలైన పిటిషన్లపై వివరణ ఇవ్వాలని ఈసీని చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాలా బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. ఢిల్లీ సర్ ప్రక్రియ జరుగుతున్న తీరుపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ పలు పిటిషన్లు దాఖలయ్యాయి. సర్ ప్రక్రియ కింద ఓటర్లకు జారీ చేస్తున్న నోటీసుల్లో స్పష్టమైన కారణాలు పేర్కొనట్లేదని పిటిషనర్ల తరఫు న్యాయవాది ప్రశాంత్ భూషన్ పేర్కొన్నారు. ఏ ప్రాతిపదికన ఓటర్లకు లాజికల్ డిస్క్రిపెన్సీ కేటగిరీ కింద నోటీసులు జారీ చేస్తున్నారని ప్రశ్నించారు. ఓటర్ల నుంచి ఏయే పత్రాలు, వివరాలను ఈసీ ఆశిస్తున్నదో కూడా స్పష్టత లేదని అన్నారు. సాధారణ ఓటర్ల వద్ద పరిమితమైన డాక్యుమెంట్స్ మాత్రమే ఉంటాయని చెప్పారు. చాలామంది దగ్గర ప్రాథమిక వివరాలున్న ప్రధాన డాక్యుమెంట్‌గా ఆదార్ కార్డు మాత్రమే ఉంటోందని చెప్పారు.ఓటర్ నమోదు ప్రక్రియలో భాగంగా ప్రజలు అప్పటికే వయసు, నివాస ధ్రువీకరణ పత్రాలు సమర్పించిన నేపథ్యంలో మళ్లీ అదనపు వివరాల నిర్ధారణకు డాక్యుమెంట్స్ ఎందుకు సమర్పించాలని ప్రశ్నించారు. నివాసం మార్పు పేరిట ఇప్పటికే ముసాయిదా ఓటర్ల జాబితా నుంచి అనేక మంది పేర్లు తొలగించారని చెప్పారు. ఇందుకు అనుసరించిన పద్ధతిపై సందేహాలు లేవనెత్తారు.




**సమయం ప్రతినిధి:** రాజ్యసభలో ఖాళీ కానున్న 12 స్థానాలకు ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఇందులో ఉత్తరప్రదేశ్‌లో 10, ఉత్తరాఖండ్‌లో ఒక రాజ్యసభ స్థానానికి ద్వైవార్షిక ఎన్నికలు జరగనున్నాయి. పశ్చిమ బెంగాల్‌లో ఖాళీ అయిన మరో స్థానానికి ఉపఎన్నిక నిర్వహించనున్నారు. పశ్చిమ బెంగాల్‌లోని రాజ్యసభ స్థానం రుక్మిణి మల్లిక్ రాజీనామాతో 2026 జులై 16న ఖాళీ అయింది. ఈ స్థానానికీ ఇదే షెడ్యూల్ ప్రకారం ఉపఎన్నిక జరగనుంది.

**ఎన్నికల షెడ్యూల్ ఇదే..** ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్‌ను సెప్టెంబర్ 29న విడుదల చేయనున్నారు. నామినేషన్ల దాఖలుకు అక్టోబర్ 6 చివరి తేదీగా ఈసీ నిర్ణయించింది. అక్టోబర్ 7న నామినేషన్ల పరిశీలన చేపట్టనున్నారు. అభ్యర్థిత్వాలను ఉపసంహరించుకునేందుకు అక్టోబర్ 9 వరకు గడువు ఇచ్చారు. అక్టోబర్ 16న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. అదే రోజు సాయంత్రం 5 గంటలకు ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. మొత్తం ఎన్నికల ప్రక్రియను అక్టోబర్ 19లోపు పూర్తి చేయాలని ఈసీ నిర్ణయించింది.

**బ్యాలెట్‌పై ప్రత్యేక నిబంధన..** రాజ్యసభ ఎన్నికల్లో బ్యాలెట్‌పై ప్రాధాన్యం గుర్తులను నమోదు చేసేందుకు రిటర్నింగ్ అధికారి అందించే నిర్దిష్ట వైలెట్ రంగు స్కెచ్ పెన్‌ను మాత్రమే ఉపయోగించాలని ఈసీ స్పష్టం చేసింది. ఇతర పెన్నులతో గుర్తులు వేయకూడదని పేర్కొంది.




**సమయం ప్రతినిధి:** బొల్లారంలోని మద్రాస్ రెజిమెంట్‌లో ఆయుధాల చోరీ కేసులో నిందితుడు మల్లేష్‌ను విచారించిన పోలీసులు.. అతడి నుంచి పలు సంచలన విషయాలు రాబట్టారు. నాలుగు నెలల ముందే అతడు ఈ ఆయుధాల చోరీకి పథక రచన చేసినట్లు బొల్లారం పోలీసులు గుర్తించారు. ఆదివారం.. సెలవు దినం కాబట్టి ఆ రోజే ఆయుధాలను చోరీ చేయాలని అతడు ముందుగా ప్లాన్ వేశాడని తెలిపారు. ఈ క్రమంలో ఆదివారం రోజు గార్డ్ ఇన్‌చార్జ్‌లు, ఆర్మీ అధికారుల కదలికలు తక్కువగా ఉంటాయని అతడు గుర్తించి.. ఈ నిర్ణయం తీసుకున్నాడని వివరించారు. దీంతో ఆ రోజే ఆయుధాల చోరీకి అతడు స్కెచ్ వేశాడని చెప్పారు. అలాగే చోరీ చేసిన ఆయుధాలను సంఘ విద్రోహశక్తులకు విక్రయించాలని మల్లేష్ భావించాడని పోలీసులు పేర్కొన్నారు. అందుకోసం ఆయుధాలు కొనుగోలు చేసే వ్యక్తుల కోసం సోషల్ మీడియాలో అతడు తీవ్రంగా వెతికినట్లు గుర్తించామని పోలీసులు తెలిపారు. తద్వారా వచ్చిన నగదుతో తన ఆర్థిక నష్టాలను పూడ్చుకోవాలని మల్లేష్ నిర్ణయించాడని అన్నారు. మూడేళ్ల పాటు సర్వీస్ ఉన్నప్పటికీ.. విధుల నుంచి తొలగించడంతో ఆర్మీ అధికారులపై మల్లేష్ కక్ష పెంచుకున్నాడని తెలిపారు. దీంతో మద్రాస్ బెటాలియన్ నుంచి ఆయుధాలు చోరీ చేయడం ద్వారా ఆ అధికారుల ప్రతిష్ఠ దెబ్బతీయాలని మల్లేష్ ఈ పథకం వేశాడని వివరించారు.

## ఆ వర్గాలను దృష్టిలో పెట్టుకునే సంక్షేమ పథకాల అమలు: సీఎం రేవంత్ రెడ్డి



**సమయం ప్రతినిధి :** దళితులు, ఆదివాసీ, గిరిజనుల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సొంత తల్లిలా ప్రేమ చూపించిన ఇందిరమ్మను వారు ఇప్పటికీ మరిచి పోలేదన్నారు. ఈరోజు (మంగళవారం) సచివాలయంలో SC, ST అట్రాసిటీ నిరోధక చట్టం అమలుపై కమిటీ సమావేశంలో సీఎం మాట్లాడుతూ.. 25 లక్షల ఎకరాలకు అసైన్డ్ పట్టాలు అందించిన ఘనత ఇందిరా గాంధీది అని కొనియాడారు. ఆమె స్ఫూర్తితోనే ఈ ప్రభుత్వం పనిచేస్తోందని వెల్లడించారు. ప్రభుత్వం ఈ వర్గాల కోసం చిత్తశుద్ధితో పనిచేస్తోందని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్లలో 31 శాతం లబ్ధిదారులు దళితులే అని తెలిపారు. ఎస్టీలకు 17 శాతం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని చెప్పారు. రాష్ట్రంలో 27.5 లక్షల మంది విద్యార్థులకు నర్సరీ నుంచి పన్నెండో తరగతి వరకు బ్రేక్ ఫాస్ట్ అందిస్తున్నామని సీఎం తెలిపారు. రాష్ట్రంలో 3 కోట్ల 48 లక్షల మందికి తెలంగాణలో సన్న బియ్యం అందిస్తున్నామన్నారు. సన్న బియ్యంతో దళిత, గిరిజన వర్గాలకు మంచి భోజనం అందించగలుగుతున్నామని తెలిపారు. దళితులు, గిరిజనులు, ఆదివాసీలను దృష్టిలో ఉంచుకుని సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు. అత్యాచార ఘటనలపై ప్రభుత్వం మానవీయ కోణంలో స్పందిస్తోందన్నారు. బాధితులకు నష్టపరిహారాన్ని బడ్జెట్‌తో ముడిపెట్టకుండా గ్రీన్ ఛానెల్‌లో విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. చదువొక్కటే జీవితాలను మారుస్తుందని.. అట్టడుగు వర్గాలను చదువు వైపు నడిపించకపోతే సమస్య పరిష్కారం కాదన్నారు. 'పిల్లల్ని చదువు వైపు, క్రీడలవైపు ప్రోత్సహించండి. రాజకీయాలకు అతీతంగా ఈ వర్గాల అభివృద్ధి చేసుకుందాం. ఈ ప్రభుత్వం మీది.. మీకోసం పనిచేస్తుంది' అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

**నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గణనాథుడికి విశేష పూజలు చేస్తున్న భక్తులు ఘనంగా సాగనంపడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. వినాయక నిమజ్జన వేడుకలు ప్రశాంతంగా నిర్వహించడానికి అప్రమత్తత అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. వినాయక నవరాత్రి ఉత్సవాల్లో చిన్న తప్పిదా లతో పెద్ద ప్ర మాదాలు చోటుచేసుకుంటున్న సంఘటనలు అనేకం ఉన్నాయి. గణనాథుడి శోభాయాత్రను సంప్రదాయ బద్ధంగా భజనలు, కోలాటాలతో నిర్వహించుకుంటే చూసే వారికి ఆనందంగా ఉంటుంది.**




**సమయం ప్రతినిధి :** ట్రాఫిక్ ఆంక్షలు, భద్రతా ఏర్పాట్లలో స్థానిక యంత్రాంగానికి, పోలీసులకు నిర్వాహకులు పూర్తి సహకారం అందించాలి. గణనాథుడికి నవరాత్రుల్లో ఉదయం, సాయంత్రం ధూప దీపనైవేద్యాలు, భజనలు, ఇతర ఆధ్యాత్మిక కార్యక్ర మాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. గణేష్ నిమజ్జన శోభాయాత్రను కూడా అంతే సంప్రదాయ పద్ధతిలో ప్రశాం తంగా నిర్వహించుకోవాలి.

**విద్యుత్‌తో జర జాగ్రత్త..** గతంలో పలు గ్రామాల్లో నిమజ్జన సమయంలో విద్యుదాఘాతంతో గాయపడి మృత్యువాత సంఘటనలు ఉన్నాయి. మరి కొందరు అంగవైక ల్యంతో బాధపడుతున్న సంఘటనలూ ఉన్నాయి. ఎత్తయిన విగ్రహాలను ఏర్పాటు చేయడంతో విద్యుత్ తీగలకు తగిలే ప్రమాదం ఉంది.

**డీజేలు వద్దు..** నవరాత్రుల పూజల అనంతరం గణనాథుడి శోభాయాత్ర నిర్వహించి నిమజ్జనం చేస్తుంటారు. కొన్ని ప్రాంతాల్లో శోభాయాత్ర డీజే హోరు, నృత్యాలతో సాగుతుంది. శోభాయాత్రలో మద్యం సేవిస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. నిమజ్జన సమయంలో ప్రమా దకర రసాయనాలతో చేసిన రంగులు చల్లుకోవడంతో కంటిచూపు దెబ్బతినే అవకాశం ఉంది. రంగులు పడక చాలా మంది శరీరం దురదకు గురవు తుంది. సంప్రదాయ రంగులను వాడుకోవడం మంచింది.

**జలాశయాల వద్ద పొంచి ఉన్న ముప్పు :** వినాయక విగ్రహాలను చెరువులు, కుంటలు, వాగులు తదితర జలాశయాలలో నిమజ్జనం చేస్తుంటారు. ఈసారి వర్షాలు తక్కువగా కురవడంతో చాలా చెరువుల్లో నీరు తగ్గింది. లోతైన ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుంది. ఇక్కడే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అధికార యంత్రాంగం చెరువులు, కుంటల వద్ద విద్యుత్ సౌకర్యం కల్పించాల్సిన అవసరం ఉంది.

## మెడికల్ ఇన్వాలిడేషన్ కేసులను నిబంధనల మేరకు పరిశీలించాలి




**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 22 (వేకువ సమయం ప్రతినిధి):** మెడికల్ ఇన్వాలిడేషన్ కేసులను నిబంధనల ప్రకారం సమగ్రంగా పరిశీలించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో జిల్లాలోని వివిధ శాఖల్లో పనిచేస్తున్న ముగ్గురు ఉద్యోగులకు సంబంధించిన మెడికల్ ఇన్వాలిడేషన్ కేసులను ఆమె పరిశీలించారు. దీర్ఘకాలిక అనారోగ్యం, ఇతర వైద్య కారణాలతో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించలేని పరిస్థితుల్లో ఉన్న ముగ్గురు ఉద్యోగులను కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్ నేరుగా కలిసి వారి ఆరోగ్య పరిస్థితి, సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మెడికల్ ఇన్వాలిడేషన్ కేసులను నిబంధనల మేరకు పరిశీలించాలని జిల్లా వైద్యాధికారిని కలెక్టర్ ఆదేశించారు. ఉద్యోగుల అర్హత, వైద్య పరిస్థితి, కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను కమిటీ సమగ్రంగా పరిశీలించిన అనంతరం తదుపరి చర్యలు చేపట్టాలని సూచించారు. మెడికల్ ఇన్వాలిడేషన్ నిర్ధారణైన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు నిబంధనల ప్రకారం ఉద్యోగం కల్పించే అంశాన్ని కూడా పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. ప్రతి కేసును క్షుణ్ణంగా పరిశీలించి, అభ్యర్థి వాస్తవంగా అర్హుడా కాదా నిర్ధారించిన తర్వాతే తగిన నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, సహాయ కలెక్టర్ (శిక్షణ) సాయి శివాని, జడ్పీసీఈఓ, ఇన్‌చార్జి డీపీఓ వెంకట్ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. ఏ. శ్రీనివాసులు, జిల్లా సంక్షేమ శాఖ అధికారి జరీనా బేగం తదితరులు పాల్గొన్నారు.




**సమయం ప్రతినిధి:** తెలంగాణలో కొత్త పెన్షన్లపై మంత్రి సీతక్క కీలక ఆదేశాలు జారీ చేశారు. అక్టోబర్‌లో కొత్త పెన్షన్ల ప్రారంభానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. దసరా పండుగకు ముందే అర్హులైన లబ్ధిదారులకు కొత్త పెన్షన్లు అందేలా చూడాలని సూచించారు. క్షేత్రస్థాయి వెరిఫికేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించి ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ మేరకు సెర్ప్ సీఈవో దివ్యా దేవరాజన్‌కు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఒంటరి మహిళలు, వితంతువులకు పూర్తి స్థాయిలో పెన్షన్లు అందజేయాలని మంత్రి సూచించారు. దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ పెన్షన్లు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దసరా నాటికి కొత్త పెన్షన్ల పంపిణీకి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందేలా చర్యలు తీసుకుంటామని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.




**సమయం ప్రతినిధి:** యూపీఐ(UPI) లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేట్(MDR) విధింపునకు సంబంధించిన ప్రచారంపై కేంద్ర ప్రభుత్వం మంగళవారం స్పష్టతనిచ్చింది. దీనిపై ఎలాంటి అపోహాలు వద్దని వెల్లడించింది. చిరు వ్యాపారులపై ఎలాంటి అదనపు భారం ఉండదన్న కేంద్రం.. రూ.2 వేల వరకు ఉన్న మర్చంట్ పేపెంట్స్‌కూ ఎండీఆర్ పూర్తిగా జీరో అని పేర్కొంది. జీఎస్టీ భారం కూడా ఉండదని స్పష్టం చేసింది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం.. మెజారిటీ డిజిటల్ చెల్లింపులకు MDR వర్తించదని వెల్లడించింది. MDRపై వ్యాపారి చెల్లించిన జీఎస్టీను ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌గా.. అమ్మకాలపై చెల్లించాల్సిన GST నుంచి సర్దుబాటు చేసుకోవచ్చని ఈ సందర్భంగా వివరణ ఇచ్చింది కేంద్రం. నెలకు లక్ష రూపాయిల వరకు UPI రశీదులు పొందే వ్యాపారులకు ఎండీఆర్ ఉండదని స్పష్టం చేసింది. వారికి వీణ=పై GST సమస్య కూడా ఉండదని వివరించింది. UPI చెల్లింపులు ఖరీదవుతాయన్న వాదనలు తప్పుదారి పట్టించేవేనని పేర్కొంది. దీనివల్ల మెజారిటీ లావాదేవీలు, చిరు వ్యాపారులు ప్రభావితం కారని వివరణ ఇచ్చింది.

# సంపాదకీయం

## ఈ తలకిందుల చదువును సరిచేసేదెవరు?

రైతులకు ఏ ఎరువులు వాడాలో, ఏ పురుగుల మందు ఎంత మోతాదులో వెయ్యాలో చెప్పడానికి ప్రతి గ్రామంలోనూ నిపుణుల్ని నియమిస్తామన్నది ఇటీవల తెలంగాణ ప్రభుత్వం. ఆ నిపుణులకు ఏ ఆరు నెలలో శిక్షణ ఇచ్చి నియమిస్తారు. మరి ఈ నిపుణులకు ఆరు నెలల్లో ఇవ్వగలిగిన పరిజ్ఞానాన్ని రైతులే పాఠశాల విద్యార్థులుగా ఉన్నప్పుడు, ఆ పదేళ్ల చదువులో ఎందుకు ఇవ్వలేకపోయారు? లోతైన క్లిష్టమైన థియరీ అంతా పాఠశాల, ఇంటర్ స్థాయిల్లో పెట్టి, నిత్య జీవితంలో అన్వయించుకోగల విద్యను మాత్రం పైస్థాయి కోర్సుల్లో బోధించే తలకిందుల చదువు వల్ల ఏం ప్రయోజనం? మెకాలే విద్యావిధానాన్ని నిర్మూలించాలని అరవయ్యేళ్లుగా నినదిస్తున్నాం. కానీ ఎలా మార్చాలో, దాని స్థానంలో ఏం ప్రవేశపెట్టాలో ఎవరూ చెప్పడం లేదు. కౌమారంలోని పిల్లలు వందల సంఖ్యలో ఆత్మహత్యలు చేసుకొనే దయనీయమైన, వికృతమైన వ్యవస్థను మాత్రం తయారుచేశాం. 'చదువు అంటే ఒక ఆనందమైన అనుభూతి కదా! జ్ఞానార్జన ఒక గొప్ప జీవితానుభవం కదా' అని ప్రొఫెసర్ హరగోపాల్ రాశారు. చదువు అంటే ఒక ఆనందమైన అనుభూతి అని భావించే ఒక్క విద్యార్థినైనా మన తెలుగు రాష్ట్రాల్లో ఎవరైనా చూపించగలరా? పాఠశాల స్థాయి పిల్లల ఆనందాన్ని కబళించే ప్రధాన శత్రువు అధిక చదువు. ఒకటో తరగతి విద్యార్థికి మూడు భాషలు నేర్పాలన్న నిర్ణయం తీసుకున్నప్పుడే మన పాలకులకు విద్యావ్యవస్థపై ఎంత అవగాహన ఉన్నదో అర్థం అవుతుంది! ప్రపంచంలో ఎక్కడైనా ప్రాథమిక విద్యార్థులకు మాతృభాష మాత్రమే నేర్పుతారు. ఇతర భాషలు నేర్చుకోవాలనుకొనేవారు డిగ్రీ స్థాయిలో వారికి ఇష్టమైన భాషలు నేర్చుకుంటారు. ఒక భాషను నేర్చుకుంటున్నామంటే అందులో కనీసం మాట్లాడటం, రాయడం రావాలి కదా! ఇందులో ఎంతవరకు విజయం సాధించాం? ఒకటో తరగతి నుంచి డిగ్రీ రెండో సంవత్సరం వరకు ఇంగ్లీషును ఒక సబ్జెక్టుగా 14 సంవత్సరాలు చదివిస్తున్నాం, పరీక్షలు పెడుతున్నాం. అయినా ఆ భాషలో ఒక వాక్యం సొంతంగా రాయడం కానీ, మాట్లాడటం కానీ చేయలేకపోతున్నారు. మరి ఈ కాలాన్ని ఎందుకు వ్యర్థం చేసినట్లు? అసలు భాష నేర్చుకోవటంలోని ప్రాథమిక లక్ష్యమైన అభివ్యక్తీకరణ రానప్పుడు దాన్నెందుకు చదివిస్తున్నాం? తల్లిదండ్రులు ఇంగ్లీషు మీడియం పాఠశాలల వైపు ఆకర్షితులవటానికి ప్రధాన కారణం ఇంగ్లీషులో మాట్లాడగలగటమే కదా. ఆ పని తెలుగు మీడియంలో కూడా చేయగలిగితే, ఒకటో తరగతి నుంచే పరాయి భాషలో అర్థం అయ్యీ, అవ్వకుండా బట్టీలు పట్టే క్షోభ పిల్లలకు ఉండదు. హిందీ పరిస్థితి కూడా ఇంతే. పెద్దయిన తరువాత నాలుగైదు నెలల్లో నేర్చుకోగలిగిన భాషను చిన్న పిల్లలకు పదేళ్ల పాటు బోధించి హింసించటమెందుకు? అసలు చిన్న పిల్లలకు మూడు భాషలు నేర్పడమేమిటి? వీటిలో రెండు భాషలు తగ్గినట్లయితే పిల్లలపై ఎంత బరువు తగ్గేదో ఆలోచించండి. దశాబ్దాల పాటు ప్రయోజనమేమీ కలగజేయని ఈ భాషా విధానాన్ని వెంటనే మార్చేయాలి. జీవశాస్త్రాన్ని హైస్కూలు నుంచి ఇంటర్ వరకు తీసుకుంటే ఇందులో ముఖ్యంగా జంతుశాస్త్రం, వృక్షశాస్త్రం ఉంటాయి. జంతుశాస్త్రంలో వెన్నెముక గల జీవులు (కార్డేటా), వెన్నెముక లేని జీవులు, ఏకకణ జీవులు, బహుకణ జీవులు, ఇతర లక్షణాల ఆధారంగా వాటి వర్గీకరణ, ప్రోటోజోవా, పొరిఫెరా, ఆర్థ్రోపొడా, ఎకైనోడెర్మేటా వంటి ఫైలాల నుంచి సబ్‌ఫైలాలు, వాటి కుటుంబాలు చివరికి ఆయా జాతుల వరకు వందలాది నామాలు, వాటి సాధారణ లక్షణాలు, బాక్టీరియా, వైరస్, జెనెటిక్స్, జెనెటిక్ కోడ్‌లు, కణాలు, వాటి నిర్మాణం, కణ విభజన, వివిధ వ్యవస్థల నిర్మాణం, పనితీరు... ఇలా ఉన్నతస్థాయి జీవశాస్త్రం అంతా చదివేస్తారు. ఇందులో ఏ జీవీ మనకు బయట కనిపించదు. మైక్రోస్కోపులో చూడాల్సిందే. జీవులను కానీ, అంతర్గత వ్యవస్థలను కానీ, కేవలం ఊహించుకోవలసి రావటం వల్ల అవి అర్థం కావు, నిత్యజీవితంలో ఉపయోగపడవు కాబట్టి ఆసక్తి కలగదు. క్లిష్టమైన లాటిన్ పేర్లు గుర్తుండవు. ఇవన్నీ బట్టీ పట్టి, ఇంత విశదంగా నేర్చుకుంటారు సరే... కానీ, ఇంటర్ చదివి వ్యవసాయం చేయదలుచుకున్న విద్యార్థికి పశువులను ఎలా పెంచాలో, వాటికి వచ్చే జబ్బులు ఏమిటో, అవి రాకుండా ఏమి జాగ్రత్తలు తీసుకోవాలో తెలియదు. గేదెలకు ఏమి ఆహారంగా పెడితే ఎక్కువ పాలిస్తాయో, గొర్రెలను ఎలా కాపాడుకోవాలో, చేపల పెంపకం, పట్టు పురుగులు... ఏమీ తెలియదు. ఇవన్నీ వెటర్నరీ డాక్టరు కోర్సులో ఉంటాయి. మరి మనం పైన చెప్పుకున్న జంతుశాస్త్రమంతా దేనికొరకు చదివినట్లు? లోతైన, క్లిష్టమైన థియరీ అంతా పాఠశాల, ఇంటర్ స్థాయిలో పెట్టి, నిత్య జీవితంలో అన్వయించుకోగల (అప్లికేషన్) విద్యను మాత్రం పై కోర్సులో పెట్టారు. నిజానికి అప్లికేషన్ కింది స్థాయిలో బోధించినట్లయితే... రోజూ చూసే జీవుల విషయం కాబట్టి విద్యార్థులు ఆసక్తితో చదువుతారు. పదో తరగతిలో చదువు మానేసినా అప్పటి వరకూ చదివిన చదువు నిత్య జీవితంలో ఉపయోగపడుతుంది. ఆసక్తి ఉన్నవారు పై చదువులకు వెళ్లి లోతుగా చదువుకుంటారు. ఇక్కడ చదవవలసింది అక్కడ, అక్కడ చదవవలసింది ఇక్కడ! ఇదీ మన తలకిందుల చదువు. వృక్షశాస్త్రంలో కూడా ఇంతే. వరి ఎన్ని రోజుల పంటో, నారుమడి చల్లి... నాట్లు ఎందుకు వేస్తారో, వరికి వచ్చే రోగాలేమిటో, వాటిని ఎలా అరికట్టాలో ఎవ్వరికీ తెలియదు. ఇతర పంటలు, పండ్లు, పూలతోటల పెంపకం, అంట్లు కట్టడం వంటి నిజజీవితంలో ఎంతో ఉపయోగపడే విజ్ఞానం వారికి బోధపడదు. ఏ విధంగానూ ఉపయోగపడని కష్టతరమైన నాలెడ్జిని, ఎందుకు చదువుతున్నామో తెలియకుండా పంటి బిగువున రుబ్బి పరీక్షల్లో రాసి, తరువాత దానితో ఏ ఉపయోగంలేక మర్చిపోతున్నారు. ఫిజిక్స్, కెమిస్ట్రీలలో కూడా ఇంతే. ఎన్నో థియరీలు చదువుతారు. ఇంట్లో ఫ్యూజు పోతే వెయ్యలేరు. పొలంలో మోటారు కానీ, ఇంట్లో ఏ పరికరమైనా కానీ పాడైతే బాగుచేయలేరు. ఫ్రిజ్ ఎలా పనిచేస్తుందో చెప్పలేరు. అలాగే కెమిస్ట్రీలో అనేకం చదువుకుంటారు. వాస్తవ జీవితంలో ఏ రసాయనాన్నీ గుర్తించలేరు. మెషీన్లు, ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్, నీటిపారుదల, మెటలర్జీ ఇలా ఎన్నో రంగాలలో వాస్తవిక అవసరాలతో సంబంధం లేకుండా చాలా విజ్ఞానాన్ని విద్యార్థులకు ప్రాథమిక స్థాయిలోనే బోధిస్తున్నాం. నిజజీవిత అవసరాలను మాత్రం ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ వంటి పై స్థాయిల్లో నేర్పుతున్నాం. ఇదీ మన తలకిందుల చదువుల ప్రత్యేకత. లెక్కల విషయం మరీ దారుణం. సాధారణంగా నిజజీవితంలో ఉపయోగపడేవి అంకగణితంలోని (అర్థమెటిక్) వడ్డీ లెక్కలు, సరాసరి, పని, కాలం, దూరం వంటివి. ఇరవై ఏళ్ల క్రితం వరకూ అంక గణితం ప్రతి తరగతిలోనూ సగం సిలబస్‌గా ఉండేది. కానీ ఇప్పుడు ఈ మొత్తాన్ని ఒకే సంవత్సరంలో ఒక చాప్టర్‌లోకి కుదించారు. ఇక మిగతా సిలబస్‌లో వాస్తవ సంఖ్యలు, కారణాంకాలు, వర్గ సమీకరణాలు, సమితులు, నిరూపక రేఖాగణితం, క్షేత్రమితి, త్రికోణమితి మొదలైనవి ఎన్నో. చదువయ్యాక నిత్య జీవితంలో వీటిని ఎప్పుడైనా ఉపయోగించిన మనిషి నాకింతవరకూ కనిపించలేదు. ఇవన్నీ పనికిరావని కాదు. ఇవి కేవలం అకడమిక్‌గా కానీ, ఇంజినీరింగ్ వంటి కోర్సులలో కానీ ఉపయోగపడుతున్నాయి. టెన్త్‌తోనో, ఇంటర్‌తోనో, డిగ్రీతోనో చదువు ఆపే విద్యార్థి వీటిని ఎక్కడ ఉపయోగించుకోవాలి? దేశంలోని పిల్లలందరూ కనీసం పదో తరగతి వరకైనా చదువుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. నిర్బంధ సార్వత్రికవిద్య పేరుతో పిల్లలందరినీ స్కూళ్లలో పెట్టి వారికి అర్థంకాని, లాభంలేని చదువును పది పదిహేనేళ్లపాటు బలవంతంగా చదివించి, వారి సమయాన్ని వృథా చేస్తున్నాం. చదువుపై మన దృక్పథం మారాలి. సిలబస్‌లను సమూలంగా మార్చాలి. చదువంటే నిజంగా ఒక అందమైన, ఆనందమైన అనుభూతిగా చేయవచ్చు. ఈ సాహసం ఎవరు చేస్తారు? ఈ తలకిందుల చదువును ఎవరు తిరిగి సరిగా నిలబెడతారు?

# జూరాలకు నీటి విడుదలపై సీఎం రేవంత్‌రెడ్డి కీలక నిర్ణయం

**కర్ణాటక సీఎంతో మాట్లాడి, సాగు నీటిని విడుదల చేయాలని కోరిన ముఖ్యమంత్రివర్యులు . రేవంత్ రెడ్డి**

**నేడు కర్ణాటకకు వెళ్లనున్న మంత్రులు, ఎమ్మెల్యేల బృందం**

మహబూబ్‌నగర్ : మహబూబ్‌నగర్ జిల్లా రైతుల సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని జూరాల ప్రాజెక్టు నుంచి కాలువల ద్వారా పంట పొలాలకు సాగునీరు అందించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి (GMR) తో పాటు మహబూబ్‌నగర్ జిల్లా మంత్రులు (రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు , రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి గద్వాల్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ... రాష్ట్ర ముఖ్యమంత్రి. రేవంత్‌రెడ్డి ని, ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని సచివాలయంలో కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జూరాలకు తగినంత నీటి లభ్యత కల్పించేందుకు కర్ణాటక ముఖ్యమంత్రి తో చర్చించాలని, రైతుల పంటలకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ని కోరారు. మంత్రులు, ఎమ్మెల్యేల విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి . రేవంత్‌రెడ్డి , కర్ణాటక ముఖ్యమంత్రి తో ఫోన్లో మాట్లాడి సాగునీటి అవసరాల దృష్ట్యా ఆల్మట్టి, నారాయణపూర్ జలాశయాల నుంచి జూరాల కు నీటిని విడుదల చేయాలని కోరారు. అదేవిధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు సాగునీటి విడుదల అంశంపై రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రులు, మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మెల్యేల బృందం నేడు కర్ణాటక ముఖ్యమంత్రిని కలిసి సాగు నీటిని విడుదల చేయాలని కర్ణాటక ముఖ్యమంత్రి ని కోరనున్నారు.



# మహబూబ్‌నగర్‌లో అమెరికా స్థాయి విజ్ఞాన కేంద్రం

**పూలే -అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం రూపకల్పనపై ప్రభుత్వ విప్ యెన్నం ప్రత్యేక దృష్టి**

**అత్యున్నత ప్రమాణాలతో 'పూలే-అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం' రూపకల్పన**

**అమెరికాలోని గ్విన్నెట్, ఫుల్టన్ కౌంటీ లైబ్రరీలను పరిశీలించిన ప్రభుత్వ విప్ యెన్నం**






మహబూబ్‌నగర్ : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో రూపుదిద్దుకుంటున్న 'పూలే-అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం'ను అంతర్జాతీయ ప్రమాణాలతో, ప్రపంచ స్థాయి సౌకర్యాలతో తీర్చిదిద్దుతామని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. అమెరికా పర్యటనలో భాగంగా ఆయన జార్జియా రాష్ట్రంలోని ప్రసిద్ధ 'గ్విన్నెట్ కౌంటీ పబ్లిక్ లైబ్రరీ'తో పాటు 'ఫుల్టన్ కౌంటీ లైబ్రరీ'ని ఆయన క్షేత్రస్థాయిలో సందర్శించి సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాల్లోని పుస్తక పఠన విభాగాలు, సరికొత్త సాంకేతిక వనరులు, భాషా నైపుణ్యాల అభ్యాస కేంద్రాలు (Language Labs), మరియు డిజిటల్ లెర్నింగ్ విభాగాలను ఆయన నిశితంగా పరిశీలించారు. గ్రంథాలయాల నిర్వహణ పద్ధతులు, విద్యార్థులు, పరిశోధకులకు అందిస్తున్న సాంకేతిక ప్రోత్సాహకాలు, అలాగే నిత్యం లైబ్రరీని సందర్శించే వివిధ వయసుల పాఠకుల వివరాలను అక్కడి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అమెరికా లైబ్రరీల్లో విద్యార్థులు, పరిశోధకులకు కల్పిస్తున్న అత్యాధునిక డిజిటల్ వాతావరణం ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉందని యెన్నం పేర్కొన్నారు. పాలమూరు యువత ప్రపంచంతో పోటీపడేలా విజ్ఞానాన్ని సముపార్జించుకోవాలన్నదే తమ లక్ష్యమని తెలిపారు. నూతనంగా నిర్మిస్తున్న 'పూలే-అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం'ను గ్విన్నెట్, ఫుల్టన్ కౌంటీ లైబ్రరీలకు ఏమాత్రం తీసిపోని రీతిలో అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. మారుతున్న కాలానుగుణంగా డిజిటల్ లెర్నింగ్, అత్యాధునిక కంప్యూటర్ ల్యాబ్‌లు, పోటీ పరీక్షల స్టడీ మెటీరియల్, హై-స్పీడ్ ఇంటర్నెట్ ఆధారిత విద్యా సౌకర్యాలను స్థానిక యువతకు అందుబాటులోకి తెచ్చి, ఈ విజ్ఞాన కేంద్రాన్ని యావత్ తెలంగాణ రాష్ట్రానికే ఆదర్శంగా నిలుపుతామని ధీమా వ్యక్తం చేశారు.

# జూరాల ఆయకట్టుకు తక్షణమే సాగునీరు విడుదల చేయాలి

## బీజేపీ నాయకుల హౌస్ అరెస్టులను ఖండించిన ఎంపీ డీకే అరుణ

హైదరాబాద్, సెప్టెంబర్ 22 (వేకువ సమయం ప్రతినిధి): జూరాల ప్రాజెక్టు ఆయకట్టు కింద ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు తక్షణమే సాగునీటిని విడుదల చేయాలని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు బీజేపీ చేపట్టిన జూరాల ప్రాజెక్టు సందర్శనను అడ్డుకుంటూ పార్టీ నాయకులను పోలీసులు గృహనిర్బంధం చేయడాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. గద్వాల జిల్లా బీజేపీ అధ్యక్షుడు రామాంజనేయులు, బీజేపీ యువ నాయకురాలు డీకే స్నిగ్ధా రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బండల వెంకట్రాములు, వెంకటేశ్వర్ రెడ్డి తదితర నాయకులను పోలీసులు గృహనిర్బంధం చేయడంపై డీకే అరుణ ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల పక్షాన బీజేపీ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. జూరాల ఆయకట్టు కింద సాగు చేస్తున్న పంటలకు నీరందక ఎండిపోతున్న పరిస్థితుల్లో ప్రభుత్వం వెంటనే స్పందించి సాగునీటిని విడుదల చేయాలని ఆమె కోరారు. పంటలను కాపాడటంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. రైతుల సమస్యలపై శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళ్తున్న నాయకులను గృహనిర్బంధం చేయడం ప్రజాస్వామ్య హక్కులను అణచివేయడమేనని అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు పిలుపు మేరకు జూరాల ప్రాజెక్టును సందర్శించేందుకు సిద్ధమైన నాయకులను ప్రభుత్వం అడ్డుకోవడం సరికాదన్నారు. జూరాల ప్రాజెక్టులో తగినంత నీటి నిల్వలు ఉన్నప్పటికీ ఆయకట్టుకు సాగునీరు విడుదల చేయకపోవడం తో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రైతుల సమస్యలను పరిష్కరించకుండా నాయకులను గృహనిర్బంధం చేయడం ద్వారా వారి గొంతును నొక్కేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని డీకే అరుణ ఆరోపించారు. జూరాల ఆయకట్టు రైతులకు సాగునీరు అందించే వరకు బీజేపీ రైతుల పక్షాన పోరాటాన్ని కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి జూరాల ప్రాజెక్టు నుంచి ఆయకట్టుకు సాగునీటిని విడుదల చేసి రైతుల పంటలను కాపాడాలని ఎంపీ డీకే అరుణ డిమాండ్ చేశారు.

# సమస్య 'ఆదివాసీలు వర్సెస్ గిరిజనేతర పేదలు' కాదు!

సమయం ప్రతినిధి :షెడ్యూల్డ్ ప్రాంతాల భూ బదలాయింపు నిబంధన, ఆంధ్రప్రదేశ్/తెలంగాణ రెగ్యులేషన్ 1/1970 రాజ్యాంగబద్ధతను సుప్రీంకోర్టు మరోసారి పరిశీలిస్తోంది. పిటిషనర్లు దీన్ని తమ హక్కులకు అడ్డంకిగా చూస్తుండగా, ఆదివాసీ సమాజాలు దీన్ని తమ అస్తిత్వానికి రక్షణ కవచంగా చూస్తున్నాయి. చర్చ మొత్తం '1/70 ఉండాలా వద్దా' అనే ద్వంద్వంలో ఇరుక్కుపోయింది, కానీ సుప్రీంకోర్టు ముందున్న అసలు ప్రశ్న అంతటితో ముగియదు. ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్న వారందరూ ఒకే సామాజికవర్గం కాదు. ఒకవైపు చారిత్రక జన్మహక్కులు కలిగిన మూల ఆదివాసులు ఉన్నారు. మరోవైపు జీవనోపాధి కోసం అటవీ ప్రాంతాలకు చేరుకున్న దళిత, బీసీ, మైనార్టీ, మైదాన గిరిజన పేద కుటుంబాలు ఉన్నాయి. ఇంకోవైపు బినామీగా వందల ఎకరాలు ఆక్రమించిన భూస్వామ్య, వాణిజ్య శక్తులు ఉన్నాయి. కాబట్టి 'గిరిజనులు-గిరిజనేతరులు' అనే ఒకే మూసలో ఈ సమస్యను చూడటం వాస్తవాన్ని వక్రీకరించడమే. 1/70 చట్టం పాలకవర్గం జాలితో ఇచ్చిన కానుక కాదు. బిర్సా ముండా, కొమురం భీమ్ పోరాటాల నుంచి శ్రీకాకుళ ఆదివాసీ సాయుధ పోరాటం, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం వరకూ సాగిన ప్రజా త్యాగాల ఫలితం. అయితే మైదాన ప్రాంతాల్లో సీలింగ్ చట్టాల వైఫల్యం, బినామీ వ్యవస్థ, అసైన్డ్ భూముల ఆక్రమణతో పాటు వ్యవసాయ రంగంలో వచ్చిన అసమాన మార్పులు, గ్రామీణ చేతివృత్తుల క్షీణత, భూమి కేంద్రీకరణ, ఇంకా ఉపాధి అవకాశాల తగ్గుదలతో పేదలు, దళితులు, బీసీలు, మైనార్టీలు ఏజెన్సీ ప్రాంతాలకు వలస వెళ్లక తప్పలేదు. ఈ భూరహిత పేదల ఏజెన్సీ వలసను రాజ్యపు భూ విధాన వైఫల్యంగా గుర్తించాలి. కానీ దాన్ని 1/70 వైఫల్యంగా చిత్రీకరించడంలోనే అసలు సమస్య ఉంది. ఈ సమస్యను మరింత సంక్లిష్టం చేస్తూ అనేక వాణిజ్య శక్తులు కూడా ఏజెన్సీ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున భూములను ఆధీనంలోకి తెచ్చుకున్నాయి. జీవనోపాధి కోసం చారిత్రకంగా ఏజెన్సీ ప్రాంతాలకు వలస వచ్చిన నిరుపేదల పరిస్థితి వేరు, వనరులు దోచుకోవడానికి వచ్చిన బడా శక్తుల వ్యూహం వేరు. కానీ రాజ్యపు విధాన వైఫల్యమే ఈ సమస్యను 'ఆదివాసీలు వర్సెస్ గిరిజనేతర పేదలు' అనే ఘర్షణగా మార్చి, బడా కబ్జాదారులను బాధ్యత నుంచి తప్పించింది. నిజానికి, రాజ్యాంగ పరిరక్షణకు, మానవీయ దృష్టికి మధ్య వైరుధ్యం సృష్టించాల్సిన అవసరం లేదు. మూల ఆదివాసుల హక్కులను కాపాడుతూనే, ఇతర పేదల జీవన సమస్యకు ప్రత్యేక పరిష్కారం చూపడం సాధ్యమే. ఈ అవగాహన ఆధారంగా ప్రభుత్వం ఆరు చర్యలు తక్షణమే చేపట్టాలి: 1) ఏజెన్సీ ప్రాంతాల్లోని కుటుంబాల భూమి వినియోగం, నివాస కాలం, జీవనాధార పరిస్థితులపై రెవెన్యూ రికార్డులకే పరిమితం కాని సమగ్ర సర్వే చేపట్టాలి. ఈ సర్వేలో సామాజిక, ఆర్థిక, చారిత్రక సమాచారాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలి. ముఖ్యంగా జీవనోపాధి కోసం పరిమిత భూమిలో అడవిని నరుక్కుని పోడు సాగు చేసుకుంటున్న నిరుపేద కుటుంబాలను, పెద్ద ఎత్తున భూములను ఆక్రమించిన లేదా వాణిజ్య ప్రయోజనాలతో వినియోగిస్తున్న వ్యక్తులు, సంస్థలను వేరు చేయాలి. 2) ఆ సర్వే ఆధారంగా మూల ఆదివాసుల సంప్రదాయ భూములు, పెద్ద ఎత్తున జరిగిన ఆక్రమణలు, జీవనోపాధి కోసం పరిమిత సాగులో ఉన్న పేద కుటుంబాలు అనే మూడు వర్గాలుగా భూములను వర్గీకరించాలి. 3) ఏజెన్సీ ప్రాంతాల్లో పోడు సాగు చేస్తూ జీవిస్తున్న ఎస్సీ, బీసీ, మైనార్టీ, మైదాన గిరిజన నిరుపేద రైతుల ఉనికిని గుర్తించే ఈ ప్రక్రియలో అధికారుల రికార్డులతో పాటు స్థానిక ఆదివాసీ గూడేల సంపూర్ణ ఆమోదాన్ని తప్పనిసరి చేయాలి, గూడెం ఆమోదం లేని ఏ క్లెయిమూ చెల్లకూడదు. దీనివల్ల బడా పెత్తందారులు చిన్న రైతుల ముసుగులో బినామీలుగా అవతరించే అవకాశం మూసుకుపోతుంది. 4) కుటుంబ జీవనాధారానికి ఎంత భూమి అవసరమో రెండు, మూడు ఎకరాలు అని ముందే ప్రకటించకుండా, కుటుంబ పరిమాణం, భూమి నాణ్యత, వర్షపాతం, పంటల స్వభావం, సాగు విధానం, స్థానిక వ్యవసాయ పరిస్థితులు, కుటుంబ జీవన వ్యయం వంటి అంశాల ఆధారంగా నిపుణుల కమిషన్ ఒక ప్రమాణాన్ని రూపొందించాలి. ఈ ప్రమాణమే భవిష్యత్తు విధానానికి ఆధారంగా ఉండాలి. 5) ఈ ప్రక్రియలో మూల ఆదివాసుల భూమిని ఇతర పేదల సమస్యకు పరిష్కారంగా చూపకూడదు. ఇతర పేదలకు ప్రత్యామ్నాయం అవసరమైతే అది ఆదివాసుల భూ హక్కులకు భంగం కలగని ప్రాంతాల్లోనే ఉండాలి. 6) ఈ ప్రక్రియ ప్రభుత్వ యంత్రాంగానికే పరిమితం కాకూడదు. ఆదివాసీ గూడేల ప్రతినిధులు, దళిత బహుజన సంఘాలు, మైనార్టీ ప్రతినిధులు, మైదాన ప్రాంత గిరిజన సంఘాలు, రైతు సంఘాలు, సామాజిక శాస్త్రవేత్తలు, వ్యవసాయ నిపుణులు, రాజ్యాంగ నిపుణులు, విశ్వవిద్యాలయ అధ్యాపకులు, రాజకీయ పార్టీలు, ప్రజాస్వామ్య సంస్థలు కలిసే విస్తృత సంప్రదింపుల ద్వారానే దీనికి సామాజిక విశ్వసనీయత లభిస్తుంది. ఈ ప్రణాళిక అమలైనప్పుడు సుప్రీంకోర్టు ముందున్న వివాదాన్ని విస్తృత సందర్భంలో చూడవచ్చు. 1/70ను రద్దు చేయాలా కొనసాగించాలా అనే ద్వంద్వానికి బదులు, దాన్ని కొనసాగిస్తూ చుట్టూ ఏర్పడిన వైరుధ్యాలను ఎలా పరిష్కరించాలనే విధానాన్ని రాజ్యం సుప్రీంకోర్టు ముందుంచాలి. అప్పుడే ఈ వివాదం 'గిరిజనులు వర్సెస్ గిరిజనేతరులు' చట్రం నుంచి బయటపడుతుంది. మూల ఆదివాసుల జన్మహక్కు రాజీపడే విషయం కాదు. అలాగే ఇతర పేదల జీవనాధారం నిర్లక్ష్యం చేయదగినది కాదు. వీరిరువురి మధ్య న్యాయమైన వంతెన నిర్మించాల్సిన బాధ్యత రాజ్యానిదే.

# అర్హులైన దివ్యాంగులందరికీ సదరం ధ్రువపత్రాలు: జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్







గద్వాల : అర్హులైన దివ్యాంగులకు సదరం ధ్రువపత్రాలు మంజూరు చేసేందుకు, ధ్రువీకరణ ప్రక్రియను సులభతరం చేయడంతో పాటు వైద్య పరీక్షల కోసం ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సహకారంతో మంగళవారం గద్వాలలోని జిల్లా మహిళా సమాఖ్య కార్యాలయం వద్ద మానసిక సమస్యలున్న దివ్యాంగులకు నిర్వహిస్తున్న ప్రత్యేక మెగా సదరం శిబిరంను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అక్కడి వైద్యులు, అధికారులతో మాట్లాడి తగు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ మానసిక వైకల్యంకు సంబంధించిన కేసులను ప్రత్యేకంగా మానసిక వైద్య నిపుణులు పరీక్షించి, సదరం ధ్రువీకరణ పత్రాలు జారీ చేయనున్నట్లు తెలిపారు. మానసిక వైకల్యానికి సంబంధం లేని ఇతర వైద్య సమస్యలతో వచ్చిన వారిని జనరల్ మెడిసిన్ విభాగానికి రిఫర్ చేసి, సంబంధిత వైద్యులు పరీక్షించి నిర్ణయం తీసుకుంటారని పేర్కొన్నారు. పక్షవాతం, ఇతర శారీరక అనారోగ్యాలు వంటి సమస్యలకు మానసిక వైకల్య ధ్రువీకరణ ఇవ్వడం సాధ్యం కాదని, అటువంటి వారు సంబంధిత వైద్య విభాగాన్ని సంప్రదించాలని సూచించారు. ప్రతి కేసును సంబంధిత వైద్యులు పూర్తిగా పరిశీలించిన అనంతరం మాత్రమే ధ్రువీకరణ పత్రం జారీ చేస్తారని తెలిపారు. శిబిరానికి వచ్చిన దివ్యాంగులకు టోకెన్ నంబర్లు కేటాయించి, సీరియల్ నంబర్ ప్రకారం లోపలికి పంపించి వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. శిబిరంలో అందుబాటులో ఉన్న స్లాట్లకు అనుగుణంగా లబ్ధిదారులను క్రమబద్ధీకరిస్తూ, రద్దీ లేకుండా ప్రత్యేక వసతులు ఏర్పాటు చేశామన్నారు. శిబిరం వద్ద అనవసరమైన రద్దీ లేకుండా, మానసిక వైకల్యానికి సంబంధించిన వారు మాత్రమే సంబంధిత విభాగంలో నమోదు చేసుకునేలా సిబ్బంది అవగాహన కల్పించాలని సూచించారు. ముందుగా ఫ్లాట్ బుక్ చేసుకున్న 92 మంది దివ్యాంగుల్లో 58 మంది చిన్నారులు ఉన్నారని ఈనెల 23వ తేదీన కూడా శిబిరం ఉంటుందని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ పర్యటనలో డిఆర్డిఓ ముషాహిదా బేగం, డిపిఎం అరుణ, ఏపిఎం భీమన్న, డా. హేమలత, డా. ప్రదీప్, తదితరులున్నారు.

## MLA పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు సైకిల్ పంపిణీ




సమయం ప్రతినిధి: జోగులాంబ గద్వాల జిల్లా జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండలంలోని తుమ్మలచెరువు గ్రామంలో గద్వాల్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా తుమ్మలచెరువు ప్రాథమిక పాఠశాలకు 17 సైకిళ్లు డొనేట్ చేసిన ఎమ్మెల్యే గారు గ్రామ సర్పంచ్ రాజు మాట్లాడుతూ ఎమ్మెల్యే గారు పుట్టినరోజు సందర్భంగా మన గ్రామానికి విద్యార్థులకు 17 సైకిల్ ఇవ్వడం జరిగింది. ఆలూరు గ్రామానికి వెళ్లే తొమ్మిదో తరగతి పదవ తరగతి చదవడానికి వెళుతున్న తుమ్మలచెరువు నుండి ఆలూరు కి వెళ్లడానికి విద్యార్థులకు ఇబ్బంది అవుతుందా అనగా మన ఎమ్మెల్యే గారు ఉచిత సైకిలు ఇవ్వడం జరిగింది. ప్రతి ఒక్క విద్యార్థి ఈ సైకిల్లను వినియోగించుకొని క్రమం తప్పకుండా పాఠశాలకు వెళ్లి చదువుకోవాలని తుమ్మలచెరువు సర్పంచ్ రాజు మాట్లాడారు ఈ కార్యక్రమంలో తుమ్మలచెరువు గ్రామ సర్పంచ్ వాడు నెంబర్లు తుమ్మలచెరువు ఉపాధ్యాయుల బృందం గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగింది.

## 11వ జాతీయ ఆయుర్వేద దినోత్సవం

మహబూబాబాద్ జిల్లా; (సెప్టెంబర్ 22 వేకువ సమయం ప్రతినిధి) :11వ జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా జిల్లా ఆయుష విభాగం ఆధ్వర్యంలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి యందు ఉచిత ఆరోగ్య శిబిరం తేదీ. 23 అనగా (బుధవారం ) రోజు ఉదయం 10 గంటలకు ఏర్పాటు చేయడమైనది. ఈ శిబిరంలో ఆయుర్వేద హోమియోపతి, వైద్యులు పరీక్షలు నిర్వహించి తగిన మందులు పంపిణీ చేయనున్నారు, ఔషధ మొక్కల ప్రదర్శన, యోగా శిక్షణ కార్యక్రమం తరగతులు, నిర్వహించుటకు ఏర్పాటు చేయబడినవి. కావున మహబూబాబాద్ జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోగలరని డాక్టర్ కిరణ్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్, జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ లు హాజరుకానున్నారు.

## ఆసియా క్రీడల్లో తొలి స్వర్ణం.. భారత మహిళా జట్టుకు మోదీ అభినందనలు

మొదటి పేజీ తరువాయి

ఆసియా క్రీడలు 2026లో తొలి స్వర్ణం సాధించిన భారత మహిళా క్రికెట్ జట్టును ప్రధాని నరేంద్ర మోదీ అభినందించారు. శ్రీలంకతో జరిగిన ఫైనల్ పోరులో టీమిండియా 147 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించి.. పసిడి పతకాన్ని నిలబెట్టుకున్న సంగతి తెలిసిందే. ఈ మేరకు ప్రధాని మోదీ అమ్మాయిలను ప్రశంసిస్తూ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. 'భారత క్రికెట్‌కు ఇది అద్భుత విజయం. ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకం సాధించిన మన అమ్మాయిలకు హృదయపూర్వక అభినందనలు. ఆత్మవిశ్వాసం, నైపుణ్యం, అద్భుతమైన సమష్టి ప్రదర్శనతో టీమిండియా అదరగొట్టింది. దేశానికి తొలి బంగారు పతకం అందించింది. దేశం గర్వించేలా చేయడమే కాదు.. యువ క్రికెటర్లకు మన అమ్మాయిలు స్ఫూర్తిగా నిలిచారు. ఆసియా క్రీడల్లో తొలిసారి ప్రవేశపెట్టిన మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ విభాగంలో కాంస్య పతకం నెగ్గిన సుచిక తరియల్‌కు అభినందనలు' అని మోదీ పేర్కొన్నారు.

**ఇది చారిత్రక విజయం: ఏపీ సీఎం :** భారత మహిళా క్రికెట్ జట్టును ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు కూడా ప్రశంసించారు. 'స్వర్ణ పతకం సాధించిన టీమిండియా అమ్మాయిలకు శుభాకాంక్షలు. హర్మన్ ప్రీత్ కౌర్ నాయకత్వంలో టీమిండియా చారిత్రక విజయాన్ని నమోదు చేసింది. ముఖ్యంగా మన తెలుగమ్మాయి, కడపకు చెందిన శ్రీచరణికి ప్రత్యేక అభినందనలు.

## డిజిటల్ చెల్లింపులపై రుసుముల భారాన్ని మోపొద్దు



అమరచింత : దేశంలో సామాన్య ప్రజలు, యువత, విద్యార్థులు, కార్మికులు, చిన్న వ్యాపారుల రోజువారీ జీవితంలో భాగమైన ఏకీకృత చెల్లింపుల వ్యవస్థ (యూపీఐ)పై కొత్త వ్యాపారి రుసుము (ఎండీఆర్) విధానం తీసుకురావడాన్ని (ఏ ఐ వై ఏఫ్ ) జిల్లా కార్యదర్శి ఎండీ కూతుబ్ వ్యతిరేకించారు. అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) అమరచింత మండలంలో ని నిరసన నిర్వహించడం జరిగింది "యూపీఐ ఛార్జీలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విధానం ప్రకారం ?2,000కు మించిన వ్యక్తి--వ్యాపారి లావాదేవీలపై 0.4 శాతం వ్యాపారి రుసుము, ?75,000 లేదా అంతకంటే ఎక్కువ లావాదేవీలపై ఒక్కో లావాదేవీకి గరిష్ఠంగా ?300 వరకు వర్తిస్తుందన్నారు. వ్యక్తి, వ్యక్తి లావాదేవీలు, ?2,000 వరకు వ్యాపారి లావాదేవీలు ఉచితంగానే కొనసాగుతాయని ప్రభుత్వం చెబుతోందని, అయితే ఈ కొత్త రుసుము విధానం వల్ల భవిష్యత్తులో చిన్న వ్యాపారులు, స్వయం ఉపాధి పొందుతున్న యువతపై పడే ఆర్థిక ప్రభావంపై స్పష్టమైన హామీ, పారదర్శకత అవసరమన్నారు. ప్రభుత్వం ప్రకారం మొత్తం వ్యాపారి లావాదేవీల్లో సుమారు 96 శాతం ప్రభావితం కావని, అయినప్పటికీ మిగిలిన లావాదేవీలపై రుసుము విధించే విధానాన్ని ప్రజా ప్రయోజనాల కోణంలో సమీక్షించాలన్నారు. యూపీఐ ప్రజల సౌకర్యం కోసం నిర్మించిన డిజిటల్ ప్రజా మౌలిక వసతి,రుసుముల విస్తరణకు మార్గంగా మారకూడదు అని ఏ ఐ వై ఎఫ్ స్పష్టం చేస్తోందన్నారు. వ్యాపారులపై విధించే రుసుమును వినియోగదారులపై అదనపు భారంగా బదిలీ చేయకుండా కఠినమైన పర్యవేక్షణ ఉండాలన్నారు. చిన్న దుకాణదారులు, వీధి వ్యాపారులు, యువత, విద్యార్థులు ఎలాంటి పరోక్ష భారానికి గురికాకుండా చూడాలని, యూపీఐ రుసుముల విధానం, వాటి పంపిణీ, భవిష్యత్ మార్పులపై పూర్తి వివరాలను ప్రజలకు వెల్లడించాలని వారు డిమాండ్ చేశారు . ప్రభుత్వం ఇప్పటికే వ్యాపారి రుసుమును వినియోగదారులపై బదిలీ చేయకూడదని బ్యాంకులకు సూచించిందని , యూపీఐ అనువర్తనాలు అదనపు లేదా దాచిన రుసుములు విధించకుండా నిబంధనలు పెట్టినట్లు తెలిపిందన్నారు . ఈ రక్షణలు కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో కచ్చితంగా అమలు కావాలని డిమాండ్ చేస్తోందన్నారు. ప్రజల డిజిటల్ చెల్లింపులు, ప్రజల ప్రయోజనాల కోసమే వుండాలన్నారు. రుసుముల భారానికి కాదు అనే నినాదంతో పారదర్శకమైన, అందరికీ అందుబాటులో ఉండే డిజిటల్ చెల్లింపు వ్యవస్థ కోసం ప్రజా చర్చను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు ఉదయ్ కుమార్, నవదీప్, వరుణ్, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ పేద ప్రజల సామాజిక,ఆర్థిక అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం... మండల తాసిల్దార్ భాస్కర్..

### అధికారుల ఆదేశాలతో జిల్లాలో మొదటగా కొండూరు గ్రామంలో గ్రామ సామాజిక మరియు వనరుల చిత్రపట ప్రదర్శన...



కొల్లాపూర్ : పేద ప్రజల సామాజిక,ఆర్థిక అభివృద్ధితో పాటు గ్రామీణ ప్రాంతాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పెంట్లవెల్లి మండల తహసిల్దార్ భాస్కర్ అన్నారు,గ్రామ సర్పంచ్ కేతూరి ధర్మతేజ ఆధ్వర్యంలో కొండూరు గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు VBG రామ్ జి అధికారులు మండల APO మోహన్ కృష్ణ తో కలిసి గ్రామ అభివృద్ధి నమూనాతో కూడిన సామాజిక చిత్రపటం,నీటి వనరుల చిత్రపటాన్ని ముగ్గుతో వేసి గ్రామ ప్రజల ముందు ప్రదర్శించారు...ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైజింగ్ తెలంగాణలో భాగంగా "గ్రామీణ అభివృద్ధి" నినాదంతో గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు,2047 నాటికి వికసిత్ భారత్ సాధించాలనే లక్ష్యంలో గ్రామీణ ప్రాంతాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు,అందులో భాగంగా గ్రామంలోని సామాజిక,ఆర్థిక పరిస్థితులు,అందుబాటులో ఉన్న వనరులు,మౌలిక వసతులు తదితర అంశాలను చిత్రపటం ద్వారా గ్రామస్థులకు అవగాహన కల్పించారు. .గ్రామంలోని వనరులను గుర్తించి,వాటిని సమర్థవంతంగా వినియోగించుకోవడంతో పాటు భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలను రూపొందించేందుకు ఈ సామాజిక వనరుల చిత్రపటం ఎంతగానో ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు, అనంతరం గ్రామ సభ నిర్వహించారు, నాగర్‌కర్నూల్ జిల్లాలో తొలిసారిగా కొండూరు గ్రామానికి ఈ అవకాశం లభించడం అభినందనీయమని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు...ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ నల్లపోతుల గోపాల్,మండల EC జయదీప్ నాథ్,TA రంజిత్ కుమార్,RWS EE విజయ్,ఇరిగేషన్ జూరాల అధికారి నాగేంద్రం, పంచాయతీ కార్యదర్శి బిచ్చన్న,వ్యవసాయ అధికారి సలేశ్వరం,గ్రామ పెద్దలు పెద్ద కృష్ణా రావు,ఉప సర్పంచ్ వడ్డేమాన్ రాముడు,వార్డు మెంబర్లు దొబ్బలి వెంకటయ్య,రెడ్డి నరేష్,నాయకులు రెడ్డి వెంకటేశ్వర్లు,డీలర్ కురుమయ్య, అంగన్వాడీ టీచర్లు,హెల్త్ సెంటర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జూరాల ప్రాజెక్టుకు సిపిఎం ఆధ్వర్యంలో పాదయాత్ర : రాస్తారోకో










ఆత్మకూరు : జూరాల ప్రాజెక్టు ద్వారా వానకాలం వరి ఇతర పంటలకు సాగునీరు విడుదల చేయాలని చలో జూరాల కార్యక్రమం సందర్భంగా సిపిఎం, తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో నందిమల్ల గ్రామం నుండి డ్యాం వరకు పాదయాత్ర నిర్వహించి డ్యాం దగ్గర రాస్తారోకో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు డి బాల్ రెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జిఎస్ గోపి, ఎం రాజు, జిల్లా నాయకులు దీ వెంకటేష్, =చీ రమేష్, ఎస్ రాజ్, అజయ్, రాఘవేంద్ర, కురుమూర్తి, రాఘవ మాట్లాడుతూ చలో జూరాల ప్రాజెక్టు కార్యక్రమానికి వస్తున్న సిపిఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ జాన్ వెస్లీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములను బూత్ పోరు దగ్గర అక్రమంగా అరెస్టు చేయడం సరైన పద్ధతి కాదన్నారు. జిల్లావ్యాప్తంగా సిపిఎం జిల్లా నాయకులు అక్రమంగా అరెస్టు చేయడం నియంతృత్వంగా వ్యవహరిస్తున్నారని వారన్నారు. వరి సాగుకు జూరాల ప్రాజెక్టు కు విడుదల చేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. అనంతరం డ్యామ్ వైపు దూసుకుపోతున్న సిపిఎం, రైతు సంఘం నాయకులను బలవంతంగా అరెస్టు చేసి ఆత్మకూర్ పోలీస్ స్టేషన్ కి తరలించడం జరిగింది. అక్రమ అరెస్టులను ఖండించాలని ప్రజానీకానికి వారు పిలుపునిచ్చారు.

# భూసేకరణ పనులను వేగవంతం చేయాలి: కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 22:** జిల్లాలో వివిధ సాగునీటి ప్రాజెక్టులు, భారత్‌మాల జాతీయ రహదారి, రైల్వే లైన్ డబ్లింగ్, పారిశ్రామిక ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో భారత్‌మాల, జాతీయ రహదారులు, రైల్వే లైన్ డబ్లింగ్, బ్రహ్మోస్ క్షిపణి తయారీ కర్మాగారం, కురుమూర్తి దేవాలయ అభివృద్ధి, ఎం.జి.కె.ఎల్.ఐ., లక్ష్మీదేవిపల్లి, అజిలాపూర్ ఎత్తిపోతల ప్రాజెక్టులతో పాటు ఇతర అభివృద్ధి పనులకు సంబంధించిన భూసేకరణ, పునరావాస కార్యక్రమాల పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. మహబూబ్‌నగర్ రూరల్, భూత్పూర్, దేవరకద్ర మండలాల్లో రైల్వే భూసేకరణకు సంబంధించిన అవార్డులు, పరిహారం చెల్లింపులు, ఖాతా ధ్రువీకరణ, న్యాయస్థాన కేసులు, వివాదాస్పద భూముల వివరాలను ఆమె అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలని, కోర్టు కేసులు, ఇతర వివాదాలను స్పష్టంగా వర్గీకరించి నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. భూత్పూర్ మండలంలో భారత్‌మాల జాతీయ రహదారి భూసేకరణకు సంబంధించి స్థానికుల సమస్యలను పరిష్కరించేందుకు భూ యజమానులతో సమావేశం నిర్వహించాలని సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. బ్రహ్మోస్ క్షిపణి తయారీ కర్మాగారానికి సంబంధించిన ప్రైవేట్ భూముల సర్వేను అదనపు సర్వేయర్లను నియమించి పది రోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కురుమూర్తి దేవాలయ అభివృద్ధి, అమర్‌రాజా పరిశ్రమ రహదారి, లక్ష్మీదేవిపల్లి, అజిలాపూర్ ప్రాజెక్టుల భూసేకరణ, పరిహారం చెల్లింపులను కూడా వేగవంతం చేయాలని సూచించారు. భూసేకరణ ప్రక్రియలో ఏ దశలోనూ జాప్యం జరగకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు పి. మధుసూదన్ నాయక్, జె.ఎల్.బి. హరిప్రియ, అసిస్టెంట్ కలెక్టర్ సాయి శివాని, భూసేకరణ ప్రత్యేక ఉప కలెక్టర్ రామిరెడ్డి, ఆర్డీఓ నవీన్, వివిధ శాఖల అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.




# పెండింగ్ కేసులపై దృష్టి సారించాలి




- జడ్చర్ల టౌన్ పోలీస్ స్టేషన్ ను సందర్శించిన జిల్లా ఎస్పీ డి.జానకి
- వినాయక నిమజ్జన ఏర్పాట్లపై సమీక్ష

జడ్చర్ల సెప్టెంబర్ 22, సమయం ప్రతినిధి: పెండింగ్ కేసులను ప్రాధాన్యత క్రమంలో తీసుకొని దర్యాప్తును వేగవంతం చేయాలని, సాక్ష్యాధారాల సేకరణ, సాక్షుల వాంగ్మూలాలు, నిందితుల గుర్తింపు, చార్జ్ షీట్ దాఖలు తదితర ప్రక్రియలను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఎస్పీ జానకి ధరావత్ ఆదేశించారు. జడ్చర్ల టౌన్ పోలీస్ స్టేషన్ ను జిల్లా ఎస్పీ డి.జానకి సందర్శించారు. పోలీస్ స్టేషన్ పనితీరు, శాంతిభద్రతలు, నేర నియంత్రణ, కేసుల దర్యాప్తు, పెండింగ్ కేసులు, సిబ్బంది పనితీరును సమీక్షించారు. గతంలో ఇచ్చిన సూచనల అమలు పరిస్థితిని పరిశీలించారు. పిటిషన్లపై సత్వర విచారణ జరిపి ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని సూచించారు.

**వినాయక నిమజ్జనం సందర్భంగా పటిష్ట బందోబస్తు :** వినాయక నిమజ్జనం సందర్భంగా జడ్చర్ల పట్టణంలో శాంతియుతంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిమజ్జన కార్యక్రమం జరిగేలా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎస్పీ ఆదేశించారు. నిమజ్జన శోభాయాత్ర రూట్లను ముందుగానే పరిశీలించి, కీలక కూడళ్లలో పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్ కు అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాలను అమలు చేయాలని సూచించారు. అనుమతి లేని డీజేలు, అధిక శబ్దం, ప్రమాదకరమైన విద్యుత్ వైరింగ్ మరియు నిబంధనలకు విరుద్ధమైన చర్యలకు తావులేకుండా పర్యవేక్షణ చేపట్టాలని స్పష్టం చేశారు. జడ్చర్ల పట్టణ పరిధిలో నేరాలకు అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి బీట్ పెట్రోలింగ్, రాత్రి గస్తీ, వాహన తనిఖీలు పెంచాలని ఆదేశించారు. రౌడీషీటర్లు, పాత నేరస్తులు, అనుమానితుల కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని సూచించారు. సీసీ కెమెరాల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించి 1930 హెల్ప్ లైన్ పై ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. "ప్రజల భద్రత, నేర నియంత్రణ, బాధితులకు సత్వర న్యాయం అందించడం పోలీసుల ప్రధాన బాధ్యత. ప్రజలకు నమ్మకం కలిగించే విధంగా ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించాలి" అని ఎస్పీ డి.జానకి అన్నారు. ఈ సందర్భంలో జడ్చర్ల టౌన్ ఇన్స్పెక్టర్ కమలాకర్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# ఎన్నికల్లో లబ్ధి కోసమే వందేమాతరం వివాదం!

సమయం ప్రతినిధి: గుజరాత్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్, మణిపూర్ రాష్ట్రాల్లో రానున్న అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే జాతీయగేయం వందేమాతరం వివాదాన్ని పాలకులు మళ్లీ లేవనెత్తారు. వందేమాతరంపై కాంగ్రెస్ వైఖరిని ఖండిస్తూ దేశవ్యాప్త ప్రచార ఉద్యమం నిర్వహిస్తామంటూ బీజేపీ కేంద్రకమిటీ తీర్మానించింది. 1937 'రాజకీయ రాజీ'ని, నాడు ముస్లింలీగ్ లేవనెత్తిన అభ్యంతరాలనూ, మతోన్మాద రాజకీయాల చారిత్రక నేపథ్యాన్నీ ప్రజల ముందుకు తెస్తామనీ, కాంగ్రెస్ నేడు ముస్లింలీగ్‌లా తయారయిందని బీజేపీ పేర్కొంది. నిజానికి హిందూ సంస్థలూ, నేతలూ రెండు చరణాల వందేమాతరం గేయాన్నే బలపరిచారు. స్వదేశీ ఉద్యమం సందర్భంగా 'వందేమాతరం' అన్న ఉర్దూ పత్రికలో లజపతిరాయ్ 1907లోనే సంపాదకీయం రాశారు: "వందేమాతరం మతపరమైన మంత్రం కాదు, స్వతంత్ర పోరాట నినాదం. 'సుజలాం సుఫలాం' అంటూ మొదటి రెండు చరణాలతో దేశాన్ని స్మరిస్తాం. హిందూ, ముస్లిం, సిక్కు సహా ప్రతి పంజాబీ దీన్ని పాడుతారు. ఇందులో పూజ భాగాన్ని తిరస్కరిస్తాం." ఆయన మాటలనే కాంగ్రెస్ తన 1937 తీర్మానంలో ఉటంకించింది. 'ఇండియాను తల్లిగా ప్రేమిస్తాం, గుడిలో దేవతగా ఆరాధించము. మాతృభూమిని దుర్గగా పూజించటం వేద విరుద్ధం. మా దేశభక్తి విగ్రహారాధనతో కూడినది కాదు, హేతుబద్ధమైనది (రేషనల్)' అని లజపతిరాయ్ 1915లోనే తన పుస్తకం 'ఆర్య సమాజ్'లో రాశారు. అందుకే రాజ్యాంగ సభ సభ్యుడైన పండిత నరేంద్రదేవ్ కూడా 1950లో దాన్నే అనుసరించారు. 1937 తీర్మానాన్ని రూపొందించింది కూడా ఆయనే కావడం విశేషం. 'సమాజ్‌వాద్, ఔర్ ధర్మ నిరపేక్షితా కేలియే దేవపూజకో రాష్ట్రీయ గానా నహీ బనాసక్తే' అని ఆ తీర్మానంలో పేర్కొన్నారు. 1939 'కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ' మహాసభలోనూ, 'సోషలిజం--జాతీయ విప్లవం' అన్న పుస్తకంలోనూ ఆయన దాన్నే పునరుద్ఘాటించారు. నిజానికి రెండు చరణాల నిర్ణయాన్ని అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ స్వయంగా 1950 జనవరి 24న రాజ్యాంగ సభలోనే ప్రకటించారు. అది మూజువాణీ పద్ధతిలో ఆమోదం పొందగానే.. 'ఇది మతపర తంతుపై హేతువు విజయం, మనం తీర్మానంలో తల్లిని ఉంచాం, దేవతను తొలగించాం' అని లోహియాతో నరేంద్రదేవ్ అన్నారు. రాజ్యాంగ సభ తీర్మానాన్ని, వందేమాతరంను -- మౌలానా ఆజాద్, కిద్వాయ్, బేగం రసూల్ సహా మొత్తం 28 మంది ముస్లిం ఎంపీలూ బలపరిచారు. 'హిందూ మహాసభ' సభ్యులు నలుగురు మినహా మిగతా వారందరూ బలపరిచారు. 'వందేమాతరం సామ్రాజ్యవాద వ్యతిరేక నినాదం' అన్న గాంధీ మాటనూ ప్రజలలోకి తీసుకువెళతామని బీజేపీ అంటోంది. 1937 తీర్మానాన్ని, రెండు చరణాల గేయంపై ఠాగూర్ సూచనలను పూర్తిగా బలపరుస్తూ గాంధీ ఇలా అన్నారు: 'బెంగాల్ విభజన రోజుల్లో హిందూ ముస్లింలందరికీ వందేమాతరం సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాట నినాదం అయింది; కేవలం హిందువులకే కాదు. ఈ విషయంలో ఒక్క తగాదానైనా ఆమోదించను. ముస్లింలను అవమానించడానికిది నినాదం కారాదు.' వాట్సప్ సేనలే కాక, బీజేపీ ముఖ్యనేతలూ 'అసత్యమేవ జయతే' అంటూ రానున్న ఎన్నికలకోసం నినదిస్తున్నారు!




సమయం ప్రతినిధి: ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో నిమ్స్ అదనపు మెడికల్ సూపరింటెండెంట్ ఎన్.లక్ష్మీభాస్కర్‌ను అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) అధికారులు మంగళవారం అరెస్ట్ చేశారు. కాసేపట్లో ఆయనను కోర్టులో హాజరుపరుస్తామని ఏసీబీ అధికారులు తెలిపారు. ఈ రోజు ఉదయం నుంచి హైదరాబాద్ ఎర్రగడ్డలోని లక్ష్మీభాస్కర్ నివాసంతో పాటు మరో 7 ప్రాంతాల్లో ఏక కాలంలో సోదాలు నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి, మణికొండ, పేట్ బషీరాబాద్ ప్రాంతాల్లో ఆయనకు ఫ్లాట్లు ఉన్నట్లు గుర్తించారు. అలాగే యాదాద్రి, నందిగామ, శామీర్‌పేట్‌లో నాలుగు ఓపెన్ ప్లాట్లతో పాటు విశాఖపట్నంలో 800 చదరపు గజాల ఓపెన్ ప్లాట్ గుర్తించామని చెప్పారు. అలాగే బ్యాంకు ఖాతాల్లో రూ.41లక్షలు, పోస్టాఫీసులో రూ.12 లక్షలు డిపాజిట్ల రూపంలో ఉన్నట్లు గుర్తించామని పేర్కొన్నారు. ఇక ప్రైవేట్ ఆర్థిక సంస్థల్లో రూ.35 లక్షలు, మ్యూచువల్ ఫండ్స్‌లో రూ.29.55 లక్షలు పెట్టుబడులు పెట్టినట్లు కనుగొన్నామని ఏసీబీ అధికారులు వివరించారు. దీంతో పాటు 517.8 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారమని ఏసీబీ అధికారులు తెలిపారు. జాగ్వార్, ఆడీ, టాటా నెక్సాన్ సహా 3 కార్లు, రాయల్ ఎన్‌ఫీల్డ్, వెస్పా, యాక్టివా, యమహా వంటి నాలుగు ద్విచక్ర వాహనాలు ఉన్నట్లు గుర్తించారమని అన్నారు. సుమారు రూ.5 లక్షల విలువైన ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లు ఉన్నాయని కూడా చెప్పారు. ఈ సోదాల్లో స్వాధీనం చేసుకున్న పత్రాల ప్రకారం లక్ష్మీభాస్కర్ మొత్తం ఆస్తుల విలువ రూ.6.13 కోట్లు ఉంటుందని లెక్కించామని పేర్కొన్నారు. వివాదంలో ఉన్న ఓ ఫ్లాట్ కొనుగోలుకు రూ.1.30 కోట్లు పెట్టుబడి పెట్టినట్లు తమ సోదాల్లో గుర్తించామని ఏసీబీ అధికారులు వెల్లడించారు. అలాగే తన సన్నిహితులకు రూ.1.33 కోట్లు అప్పుగా లక్ష్మీభాస్కర్ ఇచ్చినట్లు గుర్తించామన్నారు. ఆయన అదనపు ఆస్తులపై వెరిఫికేషన్ కొనసాగుతోందని ఏసీబీ అధికారులు వివరించారు.

## విద్యుత్ వ్యవస్థ నిర్వహణలో ప్రభుత్వం విఫలం: హరీశ్‌రావు

బీఆర్ఎస్ హయాంలో రైతులకు 24గంటల నాణ్యమైన విద్యుత్‌ను ఇచ్చామని.. కాంగ్రెస్ ప్రభుత్వం 7 గంటల కన్నా ఎక్కువగా విద్యుత్‌ను సరఫరా చేయడంలేదని ఆ పార్టీ ముఖ్యనేత, ఎమ్మెల్యే హరీశ్ రావు మండిపడ్డారు. ఈ మేరకు రేవంత్ ప్రభుత్వాన్ని తీవ్రంగా దుయ్యబట్టారు. 4 వేల మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం కలిగిన యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో కేవలం 400 మెగావాట్లు ఉత్పత్తి చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్‌కు విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లను నిర్వహించడం రాదని.. అందుకే రాష్ట్రంలో తగినంత విద్యుత్ ఉత్పత్తి జరగడం లేదని హరీశ్ ధ్వజమెత్తారు. విద్యుత్ వ్యవస్థ నిర్వహణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని హరీశ్ ఆరోపించారు. విద్యుత్ ఉత్పత్తికి అవకాశం ఉండి కూడా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆయన విమర్శించారు. ఎన్టీపీసీ 800 మెగావాట్ల ప్లాంట్ ఇస్తామంటే కూడా ప్రభుత్వం నిరాకరించిందన్నారు. కాంగ్రెస్ ఇచ్చే లో-వోల్టేజీ కరెంట్‌తో రైతుల మోటర్లు కాలిపోతున్నాయని హరీశ్ రావు ప్రభుత్వంపై ధ్వజమెత్తారు.

# ఏఐకి బానిసలం కాదు, యజమానులం కావాలి!



సమయం ప్రతినిధి: గత ఏడాది నవంబర్‌లో విడుదలైన 'ఇండియా స్కిల్స్ రిపోర్ట్ -2026' ఈ ఏడాది ఇంజనీరింగ్‌లో చేరే విద్యార్థుల తల్లిదండ్రులను ఆందోళనకు గురిచేసే ఒక వాస్తవాన్ని వెల్లడించింది. దేశంలో మొత్తం గ్రాడ్యుయేట్ల ఉద్యోగ అర్హత (ఎంప్లాయబిలిటీ) 56.35 శాతానికి పెరిగినప్పటికీ, ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ల ఉద్యోగ అర్హత మాత్రం 71.5 శాతం నుంచి 70.15 శాతం దిగువకు పడిపోయిందని తెలిపింది. మరో పరిశ్రమ సర్వే- 'ఆ ఏడాది ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లలో 83శాతం మందికి చదువు పూర్తయ్యే నాటికి ఉద్యోగం లేదా ఇంటర్న్‌షిప్ అవకాశం రాలేదు' అని వెల్లడించింది. మన దేశం ఏటా సుమారు పదిహేను లక్షల మంది ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లను తయారు చేస్తోంది. అయితే, 'ఉద్యోగానికి అర్హత' కలిగి ఉండటానికీ, 'ఉద్యోగం పొందటానికీ' మధ్య చాలా తేడా ఉంది.

చరిత్రలో ఇప్పటివరకు నాలుగు పారిశ్రామిక విప్లవాలు జరిగాయి. అవి: ఆవిరి యంత్రం, విద్యుత్, మైక్రోచిప్, పరస్పరం అనుసంధానమై పనిచేసే మేధో వ్యవస్థలు. వీటి తీరుతెన్నులను గమనిస్తే.. మొదటి విప్లవానికి భారత్ దూరంగా ఉండిపోయింది. రెండో విప్లవంలో ఇతరులపై ఆధారపడాల్సి వచ్చింది. మూడు, నాలుగో విప్లవాల నాటికి క్రమంగా ఇతర దేశాలతో సమాన స్థాయిలో పోటీ పడేలా తన స్థానాన్ని మెరుగుపరచుకుంది. అయితే ప్రస్తుత ఐదో విప్లవం భిన్నమైనది. ఈ ఏఐ విప్లవాన్ని తీర్చిదిద్దడంలో భాగస్వామ్యమయ్యే అవకాశం భారత్‌కు మొదటిసారి వచ్చింది. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుంటామా? వృథా చేసుకుంటామా? అన్నది ఇప్పుడు ఇంజనీరింగ్ కాలేజీల్లో అడుగుపెడుతున్న తరం మీదే ఆధారపడి ఉంది.

ఇటీవల ఇంజినీరింగ్‌లో చేరిన విద్యార్థులతో మాట్లాడుతున్నప్పుడు నేను యథాలాపంగా ఒక మాట అన్నాను. అదేమిటంటే... 'మీ రంగంలో లోతైన జ్ఞానం, అవగాహన సంపాదిస్తే మీరు ఏఐ సాధనాలకు యజమాని అవుతారు. లేదంటే వాటికే బానిసవుతారు' అని. దీని అర్థం ఏఐని వ్యతిరేకించడం ఎంతమాత్రమూ కాదు. ఇప్పటి వరకూ వచ్చిన ప్రతి సాంకేతిక పరిజ్ఞానమూ (క్యాలిక్యులేటర్, కంప్యూటర్, సీఏడీ సాఫ్ట్‌వేర్ వంటివి) తమ రంగంపై లోతైన అవగాహన ఉన్నవారి సామర్థ్యాన్ని మరింత పెంచింది. అలాగే, విషయం పట్ల తగినంత అవగాహన లేని వారి లోపాలను కూడా బయటపెట్టింది. ఏఐ కూడా ఇదే సూత్రాన్ని అనుసరిస్తోంది. అయితే, ఏఐని ఉపయోగించగలిగేంతగా తమ రంగంపై లోతైన అవగాహన ఉన్నవారికి, లేని వారికి మధ్య అంతరం గతంలో కంటే వేగంగా పెరుగుతోంది.

ఉద్యోగ అర్హతకు సంబంధించిన గణాంకాలు ఒక చేదు నిజాన్ని వెల్లడిస్తున్నాయి. ఎన్నో ఏళ్లుగా చాలామంది ఇంజినీరింగ్ విద్యార్థులు తమ డిగ్రీని సామర్థ్యాన్ని పెంచుకునే మార్గంగా కాకుండా, ఒక అర్హత పత్రంగా మాత్రమే భావించారు. పరీక్షలను ఎలాగోలా నెట్టుకురావడం, అత్తెసరు మార్కులు తెచ్చుకోవడం, లోతైన పరిజ్ఞానం అవసరం లేని ఉద్యోగాల కోసం ప్రయత్నించడం... వంటివాటికే ప్రాధాన్యమిచ్చారు. గతంలో ఈ విధానం ఎంతోకొంత సత్ఫలితాలను ఇచ్చింది. కానీ రాబోయే తరానికి ఇది పనికిరాదు. ఒకప్పుడు తగినంత నైపుణ్యం లేని పట్టభద్రులకు కూడా దొరికే చిన్న చిన్న ఉద్యోగాల్లోని పనులను ఇప్పుడు ఏఐ వేగంగా, తక్కువ ఖర్చుతో, మానవ వనరుల కంటే సమర్థవంతంగా చేస్తోంది. అలాగే, ప్రస్తుతం ఈ ఏఐ గురించి ఉన్న అపోహలు మరే సాంకేతిక సాధనం గురించి లేవేమో! దీన్ని నేర్చుకోవడం ఎంతో కష్టమని, కేవలం కంప్యూటర్ నిపుణులకే ఇది సాధ్యమని చాలా మంది భయపడుతుంటారు. కానీ ఏఐని సమర్థవంతంగా ఉపయోగించడం.. ఇంచుమించు ఓ వాహనం నడపడం లాంటిదే. అయితే దాన్ని బాగా నడపాలంటే ముందుగా మన రంగంపై మనకు అవగాహన ఉండాలి.

ఇది కేవలం సాంకేతిక రంగానికే పరిమితమైన అంశం కాదు. ఉదాహరణకు.. థర్మోడైనమిక్స్‌పై లోతైన అవగాహన ఉన్న ఓ మెకానికల్ ఇంజినీర్ ఏఐని ఉపయోగించి ఇంజిన్ సామర్థ్యాన్ని ఇంకాస్త మెరుగుపరచడం ఎలాగో సులభంగా గుర్తించగలడు. సెమీకండక్టర్ సాంకేతికత, భౌతికశాస్త్రంపై పట్టు ఉన్న ఎలక్ట్రానిక్స్ ఇంజినీర్.. చిప్ ఎందుకు విఫలమైందో కొన్ని నిమిషాల్లోనే కచ్చితంగా తెలుసుకోగలడు. అలాగే ఎలక్ట్రికల్ ఇంజినీర్లు, సివిల్ ఇంజినీర్లు, డాక్టర్లు, న్యాయవాదులు.. ఇలా తమ రంగంలో లోతైన అవగాహన ఉన్న వారెవరైనా ఏఐ సాయంతో ఆయా రంగాల్లోని సమస్యలను సులభంగా పరిష్కరించుకోగలరు. తమ అభివృద్ధికి బాటలు వేసుకోగలరు. అలాంటి వారికి ఈ ఏఐ విప్లవం ఎంతగానో దోహదం చేస్తుంది. ఇప్పుడు ఏం మారాలి? విద్యార్థులను పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేలా తర్ఫీదు నివ్వడం మానేయాలి. సొంతంగా ఆలోచించగలిగేలా వారికి శిక్షణ ఇవ్వడం మొదలుపెట్టాలి. బట్టీ పట్టడం, మార్కుల కోసం పరుగెత్తడం, ఏదోలా సీజీపీఏ కాపాడుకోవడం వంటి పరీక్షా కేంద్రిత విధానాలను ప్రోత్సహించకూడదు. వాటికి బదులుగా ఇంజినీరింగ్ విద్యలో నిజమైన అనుభవాధారిత అభ్యాసానికి ప్రాధాన్యం ఇవ్వాలి. ఇతరులకంటే ఏదో ఒక విషయాన్ని మరింత లోతుగా అర్థం చేసుకున్నవారే ఈ ఐదో పారిశ్రామిక విప్లవానికి నాయకత్వం వహిస్తారు. ఇంతకుముందు జరిగిన ప్రతి పారిశ్రామిక విప్లవంలోనూ భారత్ నేర్చుకునే దశలోనే ఉంది. కానీ ఏఐతో వస్తున్న ఈ విప్లవంలో మొదటిసారిగా ముందు వరుసలో నిలిచే అవకాశం మన దేశానికి వచ్చింది. మరి కాబోయే ఇంజినీర్లు పూర్తి సన్నద్ధతతో కాలేజీల్లో అడుగుపెడతారా? లేక, కేవలం అడుగుపెట్టడానికే పరిమితమవుతారా? అన్నదానిపై వారి కెరీర్ మాత్రమే కాదు.. దేశ భవిష్యత్తు కూడా ఆధారపడి ఉంది.

# ప్రాథమిక ఉన్నత పాఠశాల, అంగన్వాడీ కేంద్రం, తహసిల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ కలెక్టర్ స్నేహ శబరిష్





మహబూబాబాద్ జిల్లా (సెప్టెంబర్ 22 వేకువ సమయం ప్రతినిధి) : మంగళవారం మహబూబాబాద్ జిల్లా, కొత్తగూడ మండల కేంద్రంలో జిల్లా కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు, ప్రాథమిక ఉన్నత పాఠశాలలో జరుగుతున్న రెండు కాంప్లెక్స్ మీటింగులో పాల్గొన్నానీ విద్యార్థిని, విద్యార్థుల విద్యా సామర్థ్యాలను ప్రతి సబ్జెక్టు పై పట్టు సాధించే విధంగా తరగతులను నిర్వహించాలని, ఇంగ్లీష్ భాష పై ప్రావీణ్యం వచ్చే విధంగా వారికి శిక్షణ ఇవ్వాలని, ప్రతి విద్యార్థిని గమనిస్తూ ఉంటూ అందరికీ డిజిటల్, ఎఫ్ ఎల్ ఎన్, తరగతుల ద్వారా అత్యుత్తమ బోధనలు అందించాలని కాంప్లెక్స్ సమావేశంలో పాల్గొన్న (34) ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులకు సూచించారు, ప్రతి పాఠశాలలో పిల్లలకు హెల్త్, ఎడ్యుకేషన్ ,న్యూట్రిషన్ ,సానిటేషన్ లపై అవగాహన కల్పించాలని, షెడ్యూల్ ప్రకారం వైద్య పరీక్షలు నిర్వహించాలని, ఆరోగ్య మానసిక స్థితిగతులను గమనిస్తూ ఉండాలని తెలిపారు, పిల్లలకు అందిస్తున్న సౌకర్యాలు విద్య బోధనలపై వివరంగా ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి సెప్టెంబర్ 9 నుండి అక్టోబర్ 8 వరకు జరుగుతున్న పోషణ అభియాన్ మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మన అంగన్వాడీ – మన బాధ్యత కార్యక్రమంలో పాల్గొన్నారు, ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రాల ద్వారా ఆహారం వైవిధ్యం ముఖ్యంగా ప్రోటీన్ అధికంగా ఉండే ఆహార పదార్థాల వినియోగంపై అవగాహన నిర్వహించారు, జిల్లా స్థాయి, ప్రాజెక్టు స్థాయి, గ్రామం/ వార్డ్ లలో ప్రతి అంగన్వాడీ కేంద్రంలో ఈ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు, ఇందులో భాగంగా ఈరోజు (ఫీడింగ్ ప్రాక్టీస్ డే ) నిర్వహించి, గ్రామస్తులతో స్థానికంగా లభించే ఆహార పదార్థాలతో రుచికరమైన ఆరోగ్యకరమైన వంటకాలు తయారు చేయించడం జరిగిందని, అంగన్వాడి ఆయాలు, కార్యకర్తలు, సూపర్వైజర్స్, ప్రాజెక్ట్ అధికారులు సిడిపివోలు, అందరూ గ్రామస్థాయిలో అంగన్వాడీలలో నిర్వహించే ప్రతి కార్యక్రమాన్ని షెడ్యూల్ ప్రకారంగా నిర్వహించి పిల్లలకు, గర్భిణీలకు , బాలింతలు,ఆడవారికి ప్రభుత్వం నుండి అందిస్తున్న సౌకర్యాలను కచ్చితంగా అందజేసే విధంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. తాహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి కార్యాలయంలో కొనసాగుతున్న ప్రజాసేవలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు, వివిధ సర్టిఫికెట్లకు సంబంధించి జాప్యం చేయకుండా ప్రభుత్వ నిబంధనల ప్రకారం వెంట వెంటనే జారీ చేయాలని, మండల స్థాయిలో వచ్చిన ప్రజావాణి దరఖాస్తులలో రెవిన్యూ సదస్సులు, సాదా బైనామా తదితర దరఖాస్తులను పరిశీలించి తమ పరిధిలో ఉంటే వెంటనే పరిష్కరించాలని లేనిపక్షంలో సంబంధిత విభాగానికి సిఫారసు చేసి దరఖాస్తుదారునికి సమాచారం అందించాలని తెలిపారు, ఎస్ ఐ ఆర్, ప్రక్రియను నోటీసులు అందుకున్న వారి గ్రీవెన్స్ లను సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో ఓటు ను మ్యాపింగ్ చేయాలని, ఇప్పటివరకు రెస్పాండ్ గాని ఓటరు ను స్వయంగా కలిసి ఓటు ప్రాముఖ్యత గురించి వివరించాలని తెలిపారు, ఈ పర్యటనలో కలెక్టర్ వెంట ఇన్చార్జి డిఈఓ మందుల శ్రీరాములు, ఇంచార్జ్ వెల్ఫేర్ అధికారిని శిరీష, తహసిల్దార్ రాజు, ఎంపీడీవో అనురాధ, మండల విద్యాశాఖ అధికారి లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## ఆక్రమణకు గురైన ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదాన స్థలాన్నిల్ తిరిగి ఇవ్వాలి

### ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సంగన మోని బంగారు బాబు

నాగర్ కర్నూల్ సమయం సెప్టెంబర్ 22: నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రం లో శ్రీపురం రోడ్డు సమీపంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ (ఆర్ట్స్ అండ్ కామర్స్) కళాశాల మైదాన స్థలాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ఆక్రమించడం జరిగింది. అక్రమనకు గురైన మైదాన స్థలాన్ని కళాశాల అప్పగించాలని ఏబీవీపీ నాయకులు (మండల్ రెవెన్యూ ఆఫీసర్) MRO తబితా రాణి కి మంగళవారం వినతి పత్రం అందజేశారు. అనంతరం ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగారు బాబు మాట్లాడుతూ.... కళాశాలకు మైదాన స్థలం (ఆట స్థలం) లేక విద్యార్థులు క్రీడా రంగాలలో ముందుకు రాలేకపోతున్నారు క్రీడలు ఆడుకోవాలంటే జడ్పీ గ్రౌండ్కి వెళ్లాల్సి వస్తుంది. అనేక రకాలుగా విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కావున ఒక సర్వేయర్ ని పంపించి సర్వే చేపించి కళాశాల హద్దులు కళాశాలకు చూపించాలని అఖిల భారత విద్యార్థి పరిషత్ాబీవీపీ నుండి డిమాండ్ చేశారు. లేనియెడల విద్యార్థులం అందరం కలిసి కళాశాల మైదాన స్థలం కొరకు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని ఈ యొక్క సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర సంయుక్త కార్యదర్శి శివ, సందీప్, మహేష్, జగన్, జ్ఞానేశ్వర్, ఉదయ్ ఏబీవీపీ నాయకులు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ‘అవుట్ సోర్సింగ్’ ప్రాతిపదికన ఉద్యోగాల భర్తీ కి దరఖాస్తులు ఆహ్వానం




మహబూబాబాద్ జిల్లా (సెప్టెంబర్ 22 వేకువ సమయం ప్రతినిధి) : తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాల జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న టీచింగ్ పోస్టులను ‘అవుట్ సోర్సింగ్’ ప్రాతిపదికన భర్తీ చేయుటకు అర్హత కలిగిన అభ్యర్థుల నుండి తేది. 22.09.2026 నుండి తేది. 26.09.2026 వరకు దరఖాస్తులు స్వీకరించబడునని ప్రాంతీయ సమన్వయకర్త నేడు ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు మహబూబాబాద్ నివాసులై ఉండవలెనని, అర్హత కలిగి అభ్యర్థులను జిల్లా కమిటీ ద్వారా డెమో నిర్వహించి మెరిట్ స్టును ట్రైఇస్ హైదరాబాద్‌కు పంపబడునని అన్నారు. మహబూబాబాద్ (బాలుర) పాఠశాల, డోర్నకల్ (బాలికల) పాఠశాల, తొర్రూర్ (బాలికల) జూనియర్ కళాశాలలో గల పి.జి.టి. మ్యాథ్స్, వార్డెన్–డి.ఇ.ఓ పోస్టులకు అర్హత కలిగిన అభ్యర్థులు తేది. 22.09.2026 నుండి 26.09.2026 వరకు “అహాన్ ఏజెన్సీ” ఎస్.వి.ఎస్. మెడికల్ పైన, నెహ్రూ సెంటర్ దగ్గర, మహబూబాబాద్ జిల్లా నందు బయోడేటా మరియు విద్యార్హతల సర్టిఫికెట్లు నకలు కాపీలతో ఉదయం 11.00 నుండి సాయంత్రం 4.00 గంటల వరకు దరఖాస్తులు సమర్పించవలెనని అన్నారు. అర్హులైన వారికి డెమో ఇంటర్వ్యూ జరుపబడునని. ఈ సందర్భంగా అధికారి పేర్కొన్నారు.

## హేమాద్రి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఘనంగా శ్రీ లక్ష్మీ గణపతి హోమం



వేకువ సమయం సెప్టెంబర్ 22 కీసర ప్రతినిధి : కీసర మండలంలోని వెంకులోని గుట్ట–రాంపల్లి దాయరలో ఉన్న హేమాద్రి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీ లక్ష్మీ గణపతి హోమాన్ని మంగళవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభతో కళకళలాడగా, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని శ్రీ మహాగణపతిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. లోకక్షేమం, సర్వమంగళం, ప్రజల సుఖసంతోషాల కోసం వేదపండితుల ఆధ్వర్యం లో హోమాది కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. కార్యక్రమంలో హేమాద్రి దేవస్థానం ట్రస్ట్ చైర్మన్ కందాడి హనుమంత్ రెడ్డితో పాటు ట్రస్ట్ సభ్యులు కామసాని బాల్ రెడ్డి, వేల్పుల శ్రీనివాస్, గరుగుల మల్లేష్, కామసాని శ్రీనివాస్ రెడ్డి, గాడి రాము, కందాడి పురుషోత్తం రెడ్డి, కందాడి వెంకట్ రెడ్డి, డ్యాగల సుధాకర్, కౌకుట్ల శ్రీకాంత్ రెడ్డి, బిట్ల గంగా సముద్రం తదితరులు పాల్గొన్నారు. హోమం విజయవంతం కావడానికి సహకరించిన భక్తులకు ట్రస్ట్ చైర్మన్, సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## MCH కిట్ పోర్టల్‌లో డేటా నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలి: డా. కె. ఆనంద్



వేకువ సమయం సెప్టెంబర్ 22 కీసర ప్రతినిధి : మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి కార్యాలయంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి డా. కె. ఆనంద్ ఆధ్వర్యంలో MCH Kit Portalలో వివరాల నవీకరణ, పర్యవేక్షణ, డేటా నాణ్యతపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశానికి సంబంధిత ఆరోగ్య కేంద్రాల DEOలు, ACCలు, సూపర్‌వైజర్లు హాజరయ్యారు.ఈ సందర్భంగా డా. ఆనంద్ మాట్లాడుతూ గర్భిణీల మాతృ ఆరోగ్య వివరాలు, ప్రసవ సమాచారం, శిశు ఆరోగ్య సూచికలను పోర్టల్‌లో జాప్యం లేకుండా, పూర్తి స్థాయిలో, ఖచ్చితత్వంతో నమోదు చేయాలని సూచించారు. ఫీల్డ్ స్థాయిలో సేకరించిన సమాచారాన్ని సంబంధిత రికార్డులతో సరిచూసుకుని అప్‌డేట్ చేయాలని ఆదేశించారు.పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న వివరాలను వెంటనే పూర్తి చేయడంతో పాటు, ఇప్పటికే నమోదైన సమాచారంలో లోపాలు ఉంటే సరిచేయాలని సూచించారు. ప్రతి ఆరోగ్య కేంద్రం పరిధిలో డేటా ఎంట్రీని నిరంతరం పర్యవేక్షిస్తూ సిబ్బందికి అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని DEOలు, ACCలు, సూపర్‌వైజర్లకు సూచించారు. మాతృ, శిశు ఆరోగ్య సేవల పర్యవేక్షణకు MCH Kit Portal డేటా కీలకమని, భవిష్యత్ సమీక్షలకు ఈ సమాచారం ఆధారంగా ఉంటుందని డా. ఆనంద్ పేర్కొన్నారు. డేటా నాణ్యత, సమగ్రత, సమయానుకూల నవీకరణలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు.

## జూరాల నీటి విడుదల కోసం రైతుల పక్షాన తెగించి కోట్లాడిన బి.ఆర్.ఎస్.



వనపర్తి : జూరాల ప్రాజెక్టులో నీటి లభ్యత ఉన్నా రైతాంగానికి నీళ్లు ఇవ్వకుండా రైతులను హరిగోస పెడుతుందని 8రోజులుగా బి.ఆర్.ఎస్ పార్టీ,రైతులు కలసి ధర్నాలు,రాస్తారోకోలు చేసిన మొద్దు నిద్రపోతున్న ప్రభుత్వాన్ని ముండ్ల కర్రతో తట్టిలేపినట్టు నిన్న రైతులకు బి.ఆర్.ఎస్ పార్టీ మాజీ మంత్రివర్యులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి గారు మాజీ ఎమ్మెల్యేలు చిట్టెం.రామ్ మోహన్ రెడ్డి,అలా. వెంకటేశ్వర రెడ్డి ముట్టడికి పిలుపునివ్వడం జరిగింది. విషయతీవ్రత అర్థం కాని ప్రభుత్వం ఎక్కడికక్కడ నాయకులను గృహనిర్బంధం చేసిన కట్టలు తెంచుకున్న ఆగ్రహంతో రైతాంగం,బి. ఆర్.ఎస్ కార్యకర్తలు పంటలు కాపాడు కోవడానికి లాఠీ దెబ్బలు తట్టుకొని వెల్లువ జూరాలను ముట్టడించడంతో సోయి తెచ్చుకున్న ప్రభుత్వం రేపటి నుండి జూరాల నీళ్లు విడుదల చేయడానికి అంగీకరించడం ముమ్మాటికి బి.ఆర్.ఎస్ పార్టీ మరియు రైతుల విజయమని జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల.అశోక్ హర్షం వ్యక్తం చేశారు. రైతుల పక్షాన నిలిచిన బి.ఆర్.ఎస్ శ్రేణులకు ముఖ్యంగా రైతుల అగచాట్లు వెలుగులోకి తెచ్చిన ప్రింటు అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు పేరు పేరున కృతజ్ఞతలు అని అశోక్ అన్నారు.

**ఫలించిన నీళ్ల నిరంజనుడి వ్యూహం.**

రైతులు పంటలు ఎండిపోయి ఆగం కావడాన్ని చూసి చలించిన మాజీ మంత్రివర్యులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి గారు తన వ్యూహానికి పదను పెట్టారు. రైతుల సాధకబాధకాలు స్వయంగా కె.టి.ఆర్ దృష్టికి తీసుకొచ్చి జూరాల ఆయకట్టు రైతులను కలుసుకునే విధంగా పెబ్బేరు మండలంలో పర్యటింపజేశారు. కె.టి.ఆర్ అండతో ఆయన పిలుపుతో రైతులు స్వచ్ఛందంగా జూరాల ముట్టడికి పూనుకున్నారు అందుకు జిల్లా మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు అండగా నిలిచారు. ప్రణాళిక రూపొందించి నీటి లభ్యత వెలుగులోకి తెచ్చిన నీళ్ల.నిరంజనుడు. పాలమూరు తొలి ప్రాజెక్టు జూరాలకు 244టి. ఎం. సిల వరద జలాలు వచ్చినా ఒడిసి పట్టుకోలేని ప్రభుత్వం శ్రీశైలం తరలించి ఆంధ్రా ప్రయోజనాలు కాపాడిందని ఇది ముమ్మాటికి రేవంత్ రెడ్డి దుచర్య అని దుయ్యబట్టారు. ఇప్పటికైనా జూరాల ప్రాజెక్టులో 8.8టి. ఎం. సిల నికరజాలాలు ఉన్నాయని తాగు నీటి కోసం అని సాకులు చెబుతున్న ప్రభుత్వం 2టి. ఎం. సిల నీళ్లు రిజర్వ్ చేసుకున్న దాదాపు 7టి. ఎం. సిల నీళ్లు రైతాంగానికి ఇచ్చి వానాకాలం పంటలు కాపాడాలని సూచించారు అంతేకాకుండా వారాభంది ప్రకారం నీళ్ళు విడుదల చేసి పంటలు కాపాడాలని డిమాండ్ చేశారు. ఆల్మట్టి,నారాయణపూర్ లలో 150టి. ఎం. సిల నీళ్లు నిల్వ ఉన్నాయని కర్ణాటక ప్రభుత్వంతో మాట్లాడి నీళ్లు తెచ్చుకోవచ్చని స్పష్టం చేశారు అని నందిమల్ల.అశోక్ తెలిపారు. గృహనిర్బంధం చేసినా ఇరిగేషన్ సి.ఈ,ఎస్. ఈలతో నీటి లభ్యత లెక్కలు తేల్చి ప్రభుత్వానికి నివేదించాలని డిమాండ్ చేశారు. ప్రణాళిక లేని ప్రభుత్వం కళ్ళు తెరిపించి రైతులను కాపాడడంలో నిరంజన్ రెడ్డి గారి చొరవ అభినందనీయమని జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల.అశోక్ అన్నారు.

## గణేష్ శోభయాత్రను ప్రశాంతంగా జరుపుకోవాలి నేరడుగొమ్ము ఎస్ఐ నాగేంద్రబాబు

దేవరకొండ: నేరడుగోమ్ము: సెప్టెంబర్ 22 (సమయం ప్రతినిధి) నేరడుగొమ్ము సబ్ ఇన్స్పెక్టర్. నాగేంద్రబాబు మాట్లాడుతూ మండలంలోని గ్రామాలు వినాయక శోభాయాత్రను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎలాంటి గొడవలు లేకుండా డీజే కాకుండా సంప్రదాయబద్ధంగా ఉండే బ్యాండు సన్నాయి మేల తాళాలతో కోలాటాలతో చిన్న పెద్ద ప్రశాంతంగా గణేష్ శోభాయాత్రను ఆనందంగా జరుపుకోవాలని అన్నారు ఏమన్నా అసాంఘిక కార్యక్రమా లాకు పాల్పడిన పర్మిషన్ లేకుండా డీజే లు పెట్టిన తాగి గొడవ చేసిన వాళ్లపై కఠిన చర్యలు ఉంటాయని అన్నారు.



## జాతీయ పోషణ మాసం కార్యక్రమం గ్రామ సర్పంచ్ తిరుపతయ్య



నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి సెప్టెంబర్ 22: తెలకపల్లి మండల పరిధిలోని జంగమోనిపల్లి గ్రామంలో శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జాతీయ తొమ్మిదవ పోషణ మాసం కార్యక్రమం ఇన్చార్జి అంగన్వాడీ టీచర్ విద్యావతమ్మ అధ్యక్షతన మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో గ్రామ సర్పంచి కొట్టే తిరుపతయ్య ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అంగన్వాడి కేంద్రం కొచ్చే పోషణ విలువలతో కూడిన పౌష్టికాహారం ప్రతి ఒక్కరం గర్భిణీ సీలు బాలింతలు ప్రీస్కూల్ చిల్డ్రన్ తీసుకోవాలని సూచించారు. అనంతరం పోషణ అభియాన్ గురించి అవగాహన కల్పించారు. ఎలాంటి ఆహారం తీసుకోవాలి. అనే విషయాలు క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ సుకన్య. సునీత. గౌ రెడ్డి పల్లి, లక్నారం, గ్రామాల అంగన్వాడి టీచర్లు. మరియు గ్రామ ఉపసర్పంచ్ ఇంద్రమ్మ. పంచాయతీ కార్యదర్శి ఫర్జాన్ బేగం. గ్రామ మహిళలు తదితరులు పాల్గొన్నారు.





# మహిళలు పరస్పరం సహకరించుకుంటూ ఆర్థికంగా ఎదగాలి



## కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 22 (వేకువ సమయం ప్రతినిధి):** మహిళలు తమలోని నైపుణ్యాలను మెరుగుపరుచుకుని, ఒకరికొకరు సహకరించుకుంటూ ఆర్థిక స్వావలంబన సాధించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా పిలుపునిచ్చారు. మంగళవారం మహబూబ్‌నగర్ పట్టణంలోని 'మహబూబ్‌నగర్ ఫస్ట్' నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. మహిళలకు అందిస్తున్న నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కేంద్రంలో శిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడి శిక్షణ తీరుతెన్నులు, శిక్షణ పూర్తయిన అనంతరం లభించే ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మహిళలకు కుట్టుమిషన్, కంప్యూటర్ ప్రాథమిక అంశాలు, సౌందర్య సాధన శిక్షణ, ఎంబ్రాయిడరీ తదితర మొత్తం ఐదు విభాగాల్లో ఉచిత నైపుణ్య శిక్షణ అందిస్తున్నట్లు నిర్వాహకులు కలెక్టర్‌కు వివరించారు. శిక్షణ పూర్తయిన అనంతరం స్వయం ఉపాధి పొందడంతో పాటు వివిధ సంస్థల్లో ఉద్యోగాలు పొందేలా నాణ్యమైన శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులు రూపొందించిన వివిధ కోర్సుల ప్రాజెక్టులు, ఉత్పత్తులను కలెక్టర్ పరిశీలించి వారి నైపుణ్యాన్ని అభినందించారు. నియోజకవర్గంలో ఉచితంగా అమలు చేస్తున్న ఆరోగ్య కిట్, ఆరోగ్య కార్డు, సంకేత చిత్రాల ఆధారిత డిజిటల్ పుస్తకాలు, డిజిటల్ అభ్యసన కేంద్రాలు, వైద్య, ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షల కోసం నిర్వహిస్తున్న పయనీర్ కార్యక్రమాలతో పాటు మహిళల కోసం ఏర్పాటు చేసిన నైపుణ్యాభివృద్ధి కేంద్రం వంటి కార్యక్రమాలను ప్రతిబింబించేలా విద్యార్థినులు రూపొందించిన కళారూపాలను కూడా ఆమె తిలకించారు. ప్రతి మహిళలోనూ ఏదో ఒక ప్రత్యేక ప్రతిభ దాగి ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఒకరికి కుట్టుపనిలో నైపుణ్యం ఉంటే, మరొకరికి మార్కెటింగ్ లేదా కంప్యూటర్ రంగంలో పట్టు ఉండవచ్చన్నారు. అనవసర పోటీకి బదులుగా తమ నైపుణ్యాలను పరస్పరం పంచుకుని జట్టుగా పనిచేస్తే వ్యాపారాల్లో మంచి ఫలితాలు సాధించవచ్చని సూచించారు. నిరంతరం కొత్త విషయాలను నేర్చుకుంటూ, పొందిన శిక్షణను ఆదాయ మార్గాలుగా మలచుకోవాలని అన్నారు. మహిళలు తమ కాళ్లపై తాము నిలబడేందుకు ఇలాంటి శిక్షణా కేంద్రాలు చక్కటి వేదికలని పేర్కొన్నారు. అనంతరం రెడ్డి మహిళా వసతి గృహం ప్రాంగణంలో ప్రతిష్ఠించిన గణనాథుని మండపాన్ని కలెక్టర్ సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకురాలు ఎన్.పి. నేహా శ్రీ, 'మహబూబ్‌నగర్ ఫస్ట్' పర్యవేక్షకులు గుండా మనోహర్, ఇన్‌ఛార్జ్ నిజలింగప్ప, అనిల్, అధ్యాపకులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

# హెల్త్ కార్డు లేకనే శ్రీనివాస్ ప్రాణాలు కోల్పోయారు
# తక్షణమే జర్నలిస్టులకు హెల్త్ కార్డులు మంజూరు చేయాలి



**మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు రూ.10 లక్షల ఆర్థిక సాయం అందించాలి**
**స్పందించకపోతే పాలమూరు వేదికగా పెద్ద ఎత్తున ఉద్యమం**
**టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర కార్యదర్శి జి. మధు గౌడ్**

మహబూబ్‌నగర్/జడ్చర్ల, సెప్టెంబర్ 22 (వేకువ సమయం ప్రతినిధి): మహబూబ్‌నగర్‌కు చెందిన సీనియర్ జర్నలిస్టు శ్రీనివాస్ గుండెపోటుతో మృతి చెందడం అత్యంత బాధాకరమని, జర్నలిస్టులకు ప్రభుత్వం హెల్త్ కార్డులు మంజూరు చేసి ఉంటే ఆయనకు సకాలంలో మెరుగైన వైద్యం అందే అవకాశం ఉండేదని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర కార్యదర్శి జి. మధు గౌడ్ అన్నారు. జడ్చర్ల మండలం నసరుల్లాబాద్‌లో మంగళవారం శ్రీనివాస్ అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులతో పాటు నాయకులు, తోటి జర్నలిస్టులు నసరుల్లాబాద్‌కు చేరుకుని శ్రీనివాస్ పార్థివదేహానికి నివాళులర్పించారు. అనంతరం మధు గౌడ్ మాట్లాడుతూ.. సుమారు 30 ఏళ్లుగా జర్నలిజం రంగంలో పనిచేసిన శ్రీనివాస్ కేవలం రూ.40 వేల నగదు సకాలంలో అందుబాటులో లేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. జర్నలిస్టులకు ఆరోగ్య భద్రత కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో జర్నలిస్టులకు హెల్త్ కార్డులు మంజూరు చేసినప్పటికీ అవి అనేక సందర్భాల్లో ఉపయోగపడలేదని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు దాటినా జర్నలిస్టులకు హెల్త్ కార్డుల విషయంలో స్పష్టమైన చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన వ్యక్తి కావడంతో జర్నలిస్టుల సమస్యలు పరిష్కారమవుతాయని ఆశించామని, అయితే ఇప్పటికీ తమ సమస్యలు పరిష్కారం కాలేదని మధు గౌడ్ అన్నారు. జర్నలిస్టులకు తక్షణమే హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, అనారోగ్యంతో మృతి చెందిన జర్నలిస్టుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి జర్నలిస్టుల ఆరోగ్య భద్రతకు చర్యలు తీసుకోకపోతే మహబూబ్‌నగర్ వేదికగా పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టేందుకు కార్యాచరణ రూపొందిస్తామని మధు గౌడ్ హెచ్చరించారు.

# అక్రమ అరెస్టులను ఖండించండి- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.డి జబ్బార్

ఆత్మకూరు : జూరాల ప్రాజెక్టును సందర్శించడానికి వెళ్తున్న సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి సాగర్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకట రాములు తదితర నాయకులను భూత్పూర్ వద్ద పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని సీపీఐ(ఎం) వనపర్తి జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తుందని సిపిఎం వనపర్తి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎండి జబ్బర్ అన్నారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం డి జబ్బార్ మాట్లాడుతూ,,జూరాల ప్రాజెక్టును సందర్శించి, కృష్ణా పరివాహక ప్రాంతంలో ప్రాజెక్టుల పరిస్థితిని,రైతాంగ సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవడానికి వెళ్తున్న సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి సాగర్ ని, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకటరములు ని తదితర సీనియర్ నాయకులను భూత్పూర్ వద్ద పోలీసులు ముందస్తుగా అడ్డుకుని, అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని సీపీఐ(ఎం) వనపర్తి జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తోంది. రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం, సాగునీటి ప్రాజెక్టులలో నెలకొన్న స్థితిగతులను అధ్యయనం చేయడం ప్రతిపక్షాలకు, ప్రజా సంఘాలకు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు. ప్రజాస్వామ్యబద్ధంగా పర్యటనకు వెళు న్న నాయకులను అడ్డుకోవడం ప్రభుత్వ నిరంకుశ వైఖరికి అద్దం పడుతోంది. ప్రాజెక్టుల నిర్వహణలో, రైతులకు నీళ్లందించడంలో ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య ధోరణి బయటపడుతుందనే భయంతోనే ఈ అరెస్టులకు పాల్పడ్డారు. అరెస్టులతో ప్రజా ఉద్యమాలను,




రైతాంగ పోరాటాలను ఆపలేరని సీపీఐ(ఎం) స్పష్టం చేస్తోంది. తక్షణమే అరెస్ట్ చేసిన నాయకులందరినీ ఎటువంటి షరతులు లేకుండా విడుదల చేయాలి. జూరాల ప్రాజెక్టు ఆయకట్టు రైతులకు తగినంత సాగునీరు అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. లేనిపక్షంలో ప్రభుత్వంపై నిరసనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు

# రైతాంగానికి జూరాల ప్రాజెక్టు నుంచి సాగునీరు వెంటనే విడుదల చేయాలి

తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

వనపర్తి : తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం వనపర్తి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈరోజు ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు సందర్శించి రైతులు సాగునీరు కోసం ఆందోళన చేస్తున్న వారికి మద్దతు తెలపడం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం వనపర్తి జిల్లా కార్యదర్శి మేకల ఆంజనేయులు కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ రామచంద్రయ్య గౌడ్ మాట్లాడుతూ, ప్రాజెక్టులో ఇప్పటికీ ఐదు టీఎంసీల నీరు నిలువ ఉన్నది. ఎడమ, కుడి కాలువలకు మరియు రాజీవ్ ఎత్తిపోతల పథకానికి కాల్వల ద్వారా సాగునీరు అందివ్వాళ్ళని గత నాలుగు రోజుల నుంచి రైతులు ఆందోళన కొనసాగిస్తున్నది న్యాయమైనది. ఈ వర్షాకాలంలో ప్రతి రైతు ఒక ఎకరాకు కనీసం 50వేల రూపాయల పెట్టుబడి పెట్టి సాగు చేయడం జరిగింది. ప్రస్తుతము పొట్ట దశలో ఉన్న వరి పంట మరియు ఇతర వ్యాపార పంటలకు వర్షాలు లేక ఇటు సాగునీరు లేక పంటలు ఎండిపోయే స్థితికి ఏర్పడిన దృష్ట్యా ప్రాజెక్టులో ఐదు టీఎంసీల నిల్వ నీరు ఉన్నందుకు రాష్ట్ర ప్రభుత్వము తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాం. గత వారం రోజుల నుంచి ఎడమ కుడి మరియు రాజీ ఎత్తిపోతల పథకాలకు సాగునీరు బందు చేయడం సరైన పద్ధతి కాదు. తక్షణమే రైతులకు కనీసం మూడు టీఎంసీల నీరు పూర్తయినంతవరకైనా వదిలినా పంటలు పూర్తిగా కోత దశకు రావడానికి అవకాశం ఉంది. భారత వాతావరణ శాఖ కూడా ఈ. వారం రోజుల్లో భారీ వర్షాలు కూడా కురుస్తాయని కూడా తెలియజేస్తుంది. కాబట్టి ప్రాజెక్టులు ఉన్న సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాం. వేసవికాలంలో త్రాగునీటికి ఎద్దడి ఏర్పడినా,ఎగువ ప్రాంతంలో ఉన్న ఆల్మట్టి, నారాయణపుర్ డ్యాముల నుంచి కూడా త్రాగునీరు విడుదల చేసుకోవడానికి అవకాశాలు ఈ రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్నాయి. కాబట్టి జూరాల ప్రాజెక్టు ఎడమ కుడి మరియు రాజీవ్ ఎత్తిపోతల పథకానికి సాగునీరు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాం. ఈ సందర్భన కార్యక్రమంలో పాల్గొన్నవారు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎండి మహబూబ్ బాషా, సంగం జిల్లా కోశాధికారి ఎం ముత్యాలు కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ రామచంద్రయ్య గౌడ్ తదితరులు పాల్గొనడం జరిగింది.

# రైతులు, ప్రతిపక్షాల పోరాటంతోనే ప్రభుత్వం దిగివచ్చింది: ఎంపీ డీకే అరుణ



సమయం: సెప్టెంబర్ 22 : హైదరాబాద్: జూరాల ప్రాజెక్టు ఆయకట్టుకు సాగునీరు విడుదల చేయాలని రైతులు, ప్రతిపక్షాలు చేపట్టిన పోరాటంతో ప్రభుత్వం గత్యంతరం లేక దిగివచ్చిందని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. ఇది రైతులు సాధించిన విజయమని పేర్కొన్నారు. జూరాల ప్రాజెక్టులో నీరు అందుబాటులో ఉన్నప్పటికీ ఆయకట్టు రైతులకు సాగునీరు విడుదల చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని డీకే అరుణ విమర్శించారు. సీఎం సొంత జిల్లాలో రైతులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తున్నా స్పందించకపోవడం ప్రభుత్వానికి పరిపాలనపై పట్టు లేకపోవడానికి, రైతుల సమస్యలపై అవగాహన లేదనడానికి నిదర్శనమని అన్నారు. జూరాల ప్రాజెక్టులో సుమారు 9 టీఎంసీల నీరు ఉన్నప్పటికీ రైతుల పంటలను ఎండబెట్టే పరిస్థితి ఎందుకు వచ్చిందని ఆమె ప్రశ్నించారు. ప్రాజెక్టులో నీరు లేదని చెప్పిన మంత్రులు, ఎమ్మెల్యేలకు కనీసం జూరాలలో ఎంత నీరు ఉందో కూడా తెలియదని విమర్శించారు. రైతులు కళ్లముందు నీరు ఉండి కూడా సాగునీరు అందకపోతే చూస్తూ ఊరుకోరని అన్నారు. సెప్టెంబర్ 15 నుంచి జూరాల ఆయకట్టు రైతులు సాగునీటి కోసం ఆందోళన చేస్తున్నారని డీకే అరుణ తెలిపారు. సెప్టెంబర్ 19న నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి పంటలు ఎండిపోతున్నందున వెంటనే నీటిని విడుదల చేయాలని కోరినట్లు చెప్పారు. భవిష్యత్తులో తాగునీటి అవసరాల కోసం కర్ణాటక ప్రభుత్వంతో మాట్లాడి నీటిని తీసుకునే అవకాశం ఉందని కూడా మంత్రికి సూచించినట్లు వెల్లడించారు. రైతుల సమస్యలను కలెక్టర్, జిల్లా నీటిపారుదల శాఖ అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు ఆమె తెలిపారు. గత మూడు రోజులుగా రైతులు, ప్రతిపక్ష నాయకులు జూరాల ప్రాజెక్టు వద్ద పెద్ద ఎత్తున ధర్నాలు నిర్వహించారని చెప్పారు. రైతులు, ప్రజల్లో మంత్రులు, ఎమ్మెల్యేలపై వస్తున్న వ్యతిరేకతను కప్పిపుచ్చుకునేందుకే ఇప్పుడు కర్ణాటకతో చర్చిస్తున్నామని చెబుతున్నారని డీకే అరుణ విమర్శించారు. రైతుల సమస్యలను పట్టించుకోకుండా ఇతర వ్యవహారాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు. కర్ణాటక ప్రభుత్వంతో మాట్లాడామని చెప్పే ప్రయత్నాలు, రైతులను మభ్యపెట్టే చర్యలు మానుకోవాలని ఆమె సూచించారు. జూరాల ఆయకట్టు రైతులను మరోసారి ఇబ్బందులకు గురిచేస్తే బీజేపీ రైతుల పక్షాన నిలబడి పోరాటం కొనసాగిస్తుందని డీకే అరుణ హెచ్చరించారు.

## బి ఆర్ ఎస్ నాటకాలు: జూపల్లి

హైదరాబాద్ ::గత పదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం కృష్ణా జలాల్లో గరిష్ఠంగా వాడుకున్న నీటి వాటా కేవలం 33 శాతం మాత్రమేనని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. 72 శాతం వరకు వాటా ఏపీకి ఇచ్చేశారని విమర్శించారు. కానీ ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 45 శాతం నీళ్లు తెలంగాణ వాడుకుందని వెల్లడించారు. 299 టీఎంసీలు తెలంగాణకు, 512 టీఎంసీలు ఏపీకి ఇచ్చేందుకు కేసీఆర్ ప్రభుత్వం ఒప్పందం చేసుకుందని ధ్వజమెత్తారు. ఏపీతో రాజీపడి వారికి లేని నీటి హక్కును వరుసగా పదేండ్ల పాటు కట్టబెట్టిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని ఆరోపించారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు 69.5 శాతం వాటా రావాలని సుప్రీంకోర్టులో తమ ప్రభుత్వం కొట్లాడుతోందని పేర్కొన్నారు. నీళ్లు, నిధులు ఉన్నా కేసీఆర్ ప్రభుత్వం జూరాల కింద రిజర్వాయర్లు నిర్మించలేదన్నారు. ఇప్పుడు పాలమూరుపై లేని ప్రేమను కురిపిస్తూ వీధి నాటకాలు ఆడుతున్నారని మండిపడ్డారు.

## 9 గంటలకే వైన్ షాప్

మహబూబాబాద్ జిల్లా (సెప్టెంబర్ 22 వేకువ సమయం ప్రతినిధి): "మహబూబాబాద్‌లో కొన్ని వైన్ షాపులు నిర్ణీత సమయానికి ముందే, ఉదయం 9 గంటల సమయంలో తెరిచి నిబంధనల ప్రకారం షాపులు నిర్ణీత సమయాల్లోనే నిర్వహించాలనీ, ముందుగానే తెరవడంపై ఎక్సైజ్ అధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. ఉదయం 9 గంటలకే మద్యం అందుబాటులోకి రావడం వల్ల ఉదయాన్నే మద్యం సేవించే వారి సంఖ్య పెరిగి కుటుంబాలపై సామాజిక జీవితంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లక్ష్మీ నరసింహ వైన్స్ బాలాజీ వైన్స్ లో రూ.20 ధర ఉన్న థమ్సప్ బాటిల్‌కు రూ.25 వసూలు చేస్తున్నారనే ఆరోపణలూ ఉన్నాయి. అలాగే పలు వైన్స్ షాప్ లు కూడా నిర్ణయత సమయం కంటే ముందుగానే తెలుస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. "తెలంగాణ ఎక్సైజ్ శాఖ అధికారిక నిబంధనల్లో ఇతర ప్రాంతాల్లోని ౼4 లిక్కర్ షాపులకు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు వ్యాపార వేళలు పేర్కొనబడ్డాయి. వ్యాపార వేళలు ఉల్లంఘిస్తే ఎక్సైజ్ శాఖ నిబంధనల ప్రకారం చర్యలు / ఫీజులు విధించే అవకాశముంది." అని పేర్కొన్నారు. ఎక్సైజ్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి షాప్ ప్రారంభ సమయం, విక్రయ విధానం, బిల్లులు సంబంధిత రికార్డులను పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. ఆరోపణలు నిజమా కాదా అనేది అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి స్పష్టత ఇవ్వాలి. నిబంధనలు ఉల్లంఘించినట్లు నిర్ధారణ అయితే చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.




మెగాస్టార్ చిరంజీవి సినీ కెరీర్ మొదలుపెట్టి 48 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఇటీవల హైదరాబాద్ లోని ఓ హోటల్ లో మెగా యూత్ ఫోర్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకలో అభిమాను సత్కరించారు. ఈ వేడుకలో చిరంజీవి మాట్లాడుతూ "ప్రస్తుతం 'కాకా' సినిమాలో నటిస్తున్నాను. ఇందులో నా పాత్ర పేరు కదిరి కాళిదాసు. ఈ సినిమా చాలా ఆసక్తికరంగా ఉంటుంది. ఇందులో చాలా హెవీ సీన్స్ చేస్తున్నాను. సినిమా కోసం ప్రతిరోజూ తెల్లవారుజామున 4.30 గంటలకే నిద్రలేస్తాను. ఆ తర్వాత గంటపాటు కచ్చితంగా వ్యాయామం చేస్తాను. మేకప్ పూర్తి చేసుకుని ఉదయం 8 గంటలకే కోకాపేటలోని షూటింగ్ సెట్స్‌కు చేరుకుంటాను. నేను సమయానికి సెట్స్‌కు రావడం గొప్పగా చెప్పుకోవడానికి కాదు. నేను 10 గంటలకు వచ్చినా నన్ను ఎవరూ అడగరు. కానీ నేనే క్రమశిక్షణ పాటించకపోతే, మిగిలిన టీమ్ ఎలా ఉంటుంది? ఒక సినిమా అనేది ఎంతోమంది కలిసి పనిచేసే ప్రక్రియ. అందులో ప్రతి ఒక్కరి సమయం ఎంతో విలువైనది. అందుకే నేను నా వంతుగా సమయపాలన పాటిస్తాను. నా దర్శకులందరూ కూడా ఉదయం 7 గంటలకే పూర్తి టీమ్‌తో సెట్స్‌లో సిద్ధంగా ఉంటారు. ప్రతి ఒక్కరూ తమ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి. అమెరికా అధ్యక్షుడికైనా, ఇక్కడి సాధారణ కార్మికుడికైనా రోజుకు 24 గంటలే ఉంటాయి. కాబట్టి మనకు ఉన్న సమయాన్ని ఎంత బాగా ఉపయోగించుకుంటామన్నదే ముఖ్యం. నా 48 ఏళ్ల సినీ ప్రయాణంలో అభిమానుల ప్రేమ, అభిమానం నాకు ఎంతో బలాన్ని ఇచ్చాయి. 'మెగా యూత్ ఫోర్స్' మరింత బలోపేతం కావడానికి మీ అందరి సహాయ సహకారాలు నాకు కావాలి. అభిమానులు నా నుంచి ఏం కోరుకుంటున్నారో అది అందించడానికి నేను ఎప్పుడూ సిద్ధంగా ఉంటాను. మిమ్మల్ని వీలైనంతగా అలరించడంపైనే నా దృష్టి ఉంటుంది. మంచి సినిమాలు చేయడం, ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేయడం నా బాధ్యతగా భావిస్తాను. మీతో నాకు ఉన్న ఈ అనుబంధం ఇలాగే కొనసాగాలి. మీ ప్రేమ, ఆదరణ ఎప్పటికీ ఇలాగే ఉండాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.




వరుస పరాజయాల తర్వాత సరైన కమ్‌బ్యాక్ కోసం ఎదురుచూసిన మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ ఈ ఏడాది కొరియన్ కనకరాజుతో బాక్సాఫీస్ వద్ద అదిరిపోయే విజయాన్ని అందుకున్నారు. డిఫరెంట్ కాన్సెప్ట్‌తో థియేటర్లలో సందడి చేసి మళ్లీ సక్సెస్ ట్రాక్ ఎక్కిన వరుణ్, ఇప్పుడు తన కెరీర్‌ను మరింత వేగంగా, పక్కా ప్లానింగ్‌తో ముందుకు తీసుకెళ్తున్నారు. ప్రస్తుతం ఆయన లైనప్ చూస్తుంటే టాలీవుడ్‌లో సరికొత్త సంచలనం సృష్టించేలా కనిపిస్తోంది. ప్రస్తుతం వరుణ్ తేజ్ తన చెల్లెలు నిహారిక కొణిదెల సొంత బ్యానర్ పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్‌లో రూపొందుతున్న 'బరి' చిత్రంతో ఫుల్ బిజీగా ఉన్నారు. 'కమిటీ కుర్రాళ్లు' సినిమాతో దర్శకుడిగా తన ప్రతిభను ఘనంగా చాటుకున్న యదువంశీ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. రూరల్ బ్యాక్‌డ్రాప్‌లో, స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాగా బరి తెరకెక్కుతుంది. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది.'బరి' సెట్స్‌పై ఉండగానే, వరుణ్ తేజ్ ఖాతాలో మరో రెండు ప్రతిష్టాత్మకమైన భారీ ప్రాజెక్టులు చేరినట్లు ఇండస్ట్రీ వర్గాల్లో జోరుగా టాక్ వినిపిస్తోంది. అందులో మొదటిది కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ కార్తీక్ సుబ్బరాజు నిర్మాణంలో రానున్న ప్రాజెక్ట్. స్టోన్ బెంచ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై కార్తీక్ సుబ్బరాజు తెలుగులో ఒక డిఫరెంట్ క్రైమ్ లేదా గ్యాంగ్‌స్టర్ డ్రామాను నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారని, అందులో వరుణ్ తేజ్ లీడ్ రోల్ చేయబోతున్నారని వార్తలు వస్తున్నాయి. సరికొత్త స్క్రీన్‌ప్లే, విభిన్నమైన టేకింగ్‌తో ఈ సినిమా రూపొందనుందని సమాచారం.దీనికితోడు టాలీవుడ్ క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ సమర్పణలో, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్‌లో మరో క్రేజీ ప్రాజెక్ట్ లైన్‌లోకి వచ్చినట్లు తెలుస్తోంది. కంటెంట్ ఓరియెంటెడ్ కథలతో పాటు కమర్షియల్ సక్సెస్‌లను అందించడంలో సుకుమార్ రైటింగ్స్‌కు ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. ఆ బ్యానర్‌లో రూపొందే కథలు ఎంత సహజంగా, గ్రిప్పింగ్‌గా ఉంటాయో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. వరుణ్ తేజ్ కోసం కూడా ఒక బలమైన ఎమోషనల్ అండ్ ఇంటెన్స్ డ్రామాను సిద్ధం చేసినట్లు వినికిడి.ఫిలింనగర్ సమాచారం ప్రకారం, ప్రస్తుతం నడుస్తున్న 'బరి' పూర్తయిన వెంటనే సుకుమార్ రైటింగ్స్ ప్రాజెక్ట్ సెట్స్ పైకి వెళ్లే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఈ చిత్రానికి సంబంధించిన పూర్తి కథ, దర్శకత్వం వహించబోయే దర్శకుడు ఎవరు అనే విషయాలపై త్వరలోనే స్పష్టత రానుంది. సుకుమార్ దగ్గర అసోసియేట్‌గా పనిచేసిన ఒక ప్రతిభావంతుడైన యంగ్ డైరెక్టర్ ఈ సినిమాతో పరిచయం కాబోతున్నట్లు ఇన్‌సైడ్ టాక్.గతంలో ప్రయోగాలకు పెద్దపీట వేసిన వరుణ్ తేజ్, ఇప్పుడు కమర్షియల్ హంగులతో పాటు కథాబలం ఉన్న చిత్రాలను ఎంచుకుంటూ తన మార్కెట్‌ను భారీగా పెంచుకునే పనిలో పడ్డారు.




72వ జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రదానోత్సవం గుజరాత్‌లోని కేవాడియాలో ఘనంగా జరిగింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పురస్కారాలు అందుకున్నారు సినీ ప్రముఖులు. అల్లు అర్జున్ హీరోగా తెరకెక్కిన 'పుష్ప 2: ది రూల్' చిత్రానికి ఉత్తమ స్క్రీన్‌ప్లే (ఒరిజినల్) విభాగంలో సుకుమార్ జాతీయ అవార్డు అందుకున్నారు. అలాగే 'కమిటీ కుర్రోళ్లు' చిత్రానికి కూడా జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. నిర్మాత నిహారిక కొణిదెల అవార్డును స్వీకరించారు. 'కల్కి 2898 ఏడీ', '35.. చిన్న కథ కాదు', 'లక్కీ భాస్కర్' వంటి తెలుగు చిత్రాలు కూడా వివిధ విభాగాల్లో అవార్డులు అందుకున్నాయి. దిగ్గజ నటుడు అనంత నాగ్‌కు ప్రతిష్ఠాత్మక దాదా సాహెబ్ ఫాల్కే అవార్డును ప్రదానం చేశారు. ఉత్తమ చిత్రంగా ఆర్టికల్ 370, ఉత్తమ నటిగా యామీ గౌతమ్ అవార్డ్ అందుకున్నారు. ఉత్తమ నటుడి కేటగిరీలో మమ్ముట్టి (మలయాళ చిత్రం: భ్రమయుగం), చందు ఛాంపియన్ చిత్రానికిగాను కార్తీక్ ఆర్యన్ అవార్డులు స్వీకరించారు. ఉత్తమ దర్శకుడిగా రాజ్‌కుమార్ పెరియసామి –తమిళ చిత్రం: అమరన్ కు, స్వాతంత్ర్య వీర్ సావర్కర్ సినిమాకు గాను ఉత్తమ తొలి చిత్ర దర్శకుడిగా రణదీప్ హూడా పురస్కారాలు అందుకున్నారు.

Cinema




పాన్ ఇండియా లెవల్లో భారీ హైప్ క్రియేట్ చేస్తున్న క్రేజీ ప్రాజెక్టులలో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, సెన్సేషనల్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో వస్తున్న రాకా ఒకటి. దీపికా పదుకొణెతో పాటు, మృణాల్ ఠాకూర్, జాన్వీ కపూర్ హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. ఇండియన్ బాక్సాఫీస్ రికార్డులను బద్దలు కొట్టిన పుష్ప–2 తర్వాత అల్లు అర్జున్ నుంచి వస్తున్న సినిమా కావడం, అటు జవాన్ తో వెయ్యి కోట్లకు పైగా వసూళ్లు సాధించిన అట్లీ దీనికి దర్శకుడు కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలు ఆకాశాన్ని తాకాయి. ప్రపంచ స్థాయి సాంకేతిక విలువలతో, అత్యున్నత ప్రమాణాలతో ఈ సినిమాను అట్లీ ప్లాన్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే దర్శకుడు అట్లీ పుట్టినరోజు సందర్భంగా ఏదో ఒక అదిరిపోయే అప్‌డేట్ వస్తుందని ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఐకాన్ స్టార్ అభిమానులు ఎంతో ఆశగా ఎదురుచూశారు. సోషల్ మీడియాలో సైతం కొన్ని రోజులుగా ఈ బర్త్‌డే స్పెషల్ ట్రీట్ గురించే పెద్ద ఎత్తున చర్చ సాగింది. అయితే మేకర్స్ ఇచ్చిన అప్‌డేట్ మాత్రం ఫ్యాన్స్‌ను ఆశ్చర్యానికి గురిచేయడమే కాకుండా, కాస్త నిరాశకు కూడా గురిచేసింది. ఈ సినిమా కోసం ఏకంగా 37 మంది మోషన్ క్యాప్చర్ (Mo-Cap) ఆర్టిస్టులు ఏకకాలంలో పనిచేశారని, ఇది ప్రపంచంలోనే సరికొత్త చరిత్ర సృష్టిస్తూ 'గిన్నిస్ వరల్డ్ రికార్డ్' సాధించిందని చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. హాలీవుడ్ స్థాయి విజువల్స్ కోసం భారతీయ సినిమాలో ఇలాంటి భారీ టెక్నాలజీని ఉపయోగించడం కచ్చితంగా గర్వించదగ్గ విషయమే. టెక్నికల్ పరంగా చూస్తే ఇండియన్ సినిమాను నెక్ట్స్ లెవల్‌కు తీసుకెళ్లే ప్రయత్నమిది. అయితే సాధారణ ప్రేక్షకులకు, ముఖ్యంగా మాస్ పల్స్ తెలిసిన బన్నీ అభిమానులకు మాత్రం ఈ రికార్డుల కంటే తెరపై తమ హీరో ఎలా కనిపించబోతున్నాడన్నదే ముఖ్యం. కనీసం ఒక పవర్‌ఫుల్ గ్లింప్స్, పోస్టర్ లేదా అల్లు అర్జున్ ఫస్ట్ లుక్ రివీల్ అవుతుందని భావించిన ఫ్యాన్స్‌కు ఈ మోక్యాప్ రికార్డు ప్రకటన ఒకింత అసంతృప్తినే మిగిల్చింది. అయితే ఆ తర్వాత కొద్దిసేపటికే మేకర్స్ ఒక మేకింగ్ వీడియోను విడుదల చేశారు. దీనితో ఫ్యాన్స్‌లో మళ్లీ కొత్త ఆశలు చిగురించాయి. ఏకంగా నాలుగు నిమిషాల నిడివితో వచ్చిన ఈ వీడియోలో అసలు సినిమా నేపథ్యం ఏమిటి, తెరవెనుక ఎలాంటి మాయాజాలం జరుగుతోందో చూపించారు.కానీ మొత్తం నాలుగు నిమిషాల వీడియో పూర్తయ్యే వరకు కేవలం టెక్నీషియన్ల హడావుడి, సెట్స్, కెమెరా వెనుక వర్క్ మాత్రమే కనిపించింది తప్ప.. చివరి క్షణంలో కూడా ఒక్కటంటే ఒక్క విజువల్ అవుట్‌పుట్ షాట్ కూడా చూపించలేదు. కనీసం లాస్ట్ ఫ్రేమ్‌లోనైనా బన్నీ క్యారెక్టర్‌కు సంబంధించిన చిన్న విజువల్ బిట్‌ను యాడ్ చేసి ఉంటే అభిమానుల ఉత్సాహం వేరే లెవల్లో ఉండేది. ఎలాంటి విజువల్ సర్‌ప్రైజ్ లేకుండా వీడియో ముగియడంతో సోషల్ మీడియాలో ఫ్యాన్స్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. వరల్డ్ రికార్డులు సాధించడం గర్వకారణమే, కానీ బర్త్‌డే స్పెషల్‌గా మేము కోరుకున్నది హీరో విజువల్ ట్రీట్ అంటూ అభిమానులు కామెంట్లు పెడుతున్నారు. అట్లీ లాంటి కమర్షియల్ డైరెక్టర్ నుండి ఇలాంటి ప్యూర్ టెక్నికల్ అప్‌డేట్ మాత్రమే రావడం ఎవరూ ఊహించలేదు. ఏదేమైనా ఈ ప్రాజెక్ట్ ఎంత భారీ స్థాయిలో రూపొందుతోందో ఈ మేకింగ్ వీడియో స్పష్టం చేసింది. ఇక తదుపరి అప్‌డేట్‌లోనైనా మేకర్స్ ఐకాన్ స్టార్ ఫ్యాన్స్ ఆకలి తీర్చేలా ఒక అదిరిపోయే టీజర్ లేదా ఫస్ట్ లుక్ గ్లింప్స్‌తో వస్తారేమో వేచి చూడాలి.




OWNED, PRINTED AND PUBLISHED BY KARNAM BHASKAR RAO, PRINTED AT SHREYA SREE PRINTERS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST., T.S. PUBLISHED AT SREEJA SREE PUBLICATONS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST, T.S, RNI NO: APTEL/2012/47246 EDITOR : KARNAM BHASKAR RAO, Ph: 08542-222814, Cell: 9848997085